RNI TELTEL/2024/89620

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

Gk MEDIA

ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 02, సంచిక 41, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -10, శుక్రవారం - 16 - మే - 2025 , వెల రూ.5/-

## చేతికి చిక్కిన భారత జవాన్‌ను చిత్రహింసలకు గురిచేసిన పాకిస్థాన్

బీఎస్ఎఫ్ జవాన్‌కు నరకం చూపిన పాక్



2

నిర్బంధంలో కళ్లకు గంతలు, నిద్రలేకుండా వేధింపులు. మాటలతో దూషణలు, తీవ్ర ఇబ్బందులు పెట్టిన పాక్

## రాష్ట్ర అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలు కలిసి రావాలి

- కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసి రావాలి: బండి సంజయ్



- గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రానికి సహకరించలేదు
- ' కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సైనిక స్కూల్ ను ఏర్పాటు చేయాలి
- గత నెలలోనే రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు విజ్ఞప్తి చేశాం

2లో

## భారత్ నుంచి కీలక వాణిజ్య ప్రతిపాదన వచ్చిందన్న డొనాల్డ్ ట్రంప్



- అమెరికా ఉత్పత్తులపై సుంకాలు ఉండవంటూ భారత్ ఆఫర్ ఇచ్చిందన్న ట్రంప్
- భారత్‌లో కాకుండా అమెరికాలోనే ఉత్పత్తి చేయాలని ఆపిల్‌కు సూచన
- భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముమ్మరం

## రాష్ట్రపతికి సుప్రీంకోర్టు డెడ్‌లైన్ ఏంటి?.. సంచలనంగా ద్రౌపది ముర్ము ప్రశ్నలు!

- రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చింది
- రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు పశ్నలు
- తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో, రాష్ట్ర బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు



ఢిల్లీ: ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా ఖండించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో, రాష్ట్ర బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై తాజాగా ద్రౌపదీ ముర్ము స్పందించారు. ఈ క్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై మిగతా.. 2లో

## కశ్మీర్‌లో రాజ్‌నాథ్ పర్యటన.. పాక్ అణుభద్రతపై తీవ్ర ఆందోళన



- ఆపరేషన్ సిందూర్ అనంతరం రాజ్‌నాథ్ సింగ్ తొలిసారి జమ్మకశ్మీర్‌లో పర్యటన
- బాధ్యతారహిత పాకిస్థాన్ చేతిలోని అణ్వాయుధాల భద్రతపై ప్రపంచం దృష్టి సారించాలని విజ్ఞప్తి
- పాక్ అణ్వాయుధాలను ఐఏఈఏ పర్యవేక్షించాలని సూచన
- ఉగ్రదాడులను యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరిక

శ్రీనగర్: పాకిస్థాన్ అణు కేంద్రాలను అంతర్జాతీయ సంస్థ పర్యవేక్షణలోకి తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశంలో ఎలాంటి ఉగ్రవాద దాడి జరగనంత వరకే ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం శ్రీనగర్‌లోని బాదామీ బాగ్ కంటోన్మెంట్ ప్రాంతంలోని సైనిక ప్రధాన కార్యాలయంలో ఆర్మీ సైనికులను ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, "వారు (ఉగ్రవాదులు) మన తలపై మిగతా.. 2లో

## కేసు పెట్టి లోపల వేయిస్తా..

## మహబూబ్‌నగర్ సీఈకి సీఎం వార్నింగ్!

- ప్రాజెక్టులపై రేవంత్ రెడ్డి సీరియస్ సమీక్ష
- కాళేశ్వరం తరహాలో చేస్తే సహించేది లేదని హెచ్చరిక
- ప్రాజెక్టుల నిర్మాణంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు
- వచ్చే రెండేండ్లలో 2027 జూన్ నాటికి కృష్ణాపై అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి




హైదరాబాద్: రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతి, నిర్వహణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) రమణారెడ్డికి సీఎం తీవ్ర హెచ్చరికలు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. "అక్కడ (గతంలో పనిచేసిన చోట) చేసినట్లు ఇక్కడ కూడా చేస్తే కేసు పెట్టి లోపల వేయిస్తా" అంటూ సీఎం వ్యాఖ్యానించినట్లు సమాచారం. రమణారెడ్డి గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా బాధ్యతలు నిర్వర్తించిన నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ, పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్) సమస్యలు పూర్తిగా పరిష్కారమై, పంపుహౌస్‌ల పనులు ప్రారంభమైన తర్వాతే పైపులకు సంబంధించిన బిల్లులు సమర్పించాలని మహబూబ్‌నగర్ సీఈకి ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. గతంలో జరిగిన పొరపాట్లను ప్రస్తావిస్తూ, అలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంలో అక్రమాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నమోదు చేసిన కేసుల్లో సంబంధం ఉన్న వారిపై చర్యలు కచ్చితంగా మిగతా.. 2లో

## జూన్ 21న విశాఖకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

- జూన్ 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



అమరావతి: విశాఖపట్నంలో జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ వేడుకలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమికంగా సమీక్ష నిర్వహించారు. మే 2న ప్రధాని అమరావతికి వచ్చినపుడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విశాఖపట్నంలో నిర్వహించాలని, ఆ వేడుకలకు తాను హాజరవుతానని సభా వేదిక నుండి ప్రకటించారు. అందుకు అనుగుణంగా జూన్ 21న విశాఖలో"Yoga for One Earth, One Health"అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన తెచ్చేందుకు ఇప్పటికే మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా గత మార్చి 13 నుండి జూన్ 21 వరకు 100 రోజుల్లో 100 నగరాల్లో 100 ఆర్గనైజేషన్ల పేరిట గ్లోబల్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. మిగతా.. 2లో



2

## గాజాపై ఇజ్రాయెల్ మరోసారి భీకర దాడులు... 54 మంది మృతి

దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

నిన్న రాత్రిపూట జరిగిన 10 వైమానిక దాడులు

వందలాది మందికి గాయాలు.. క్షతగాత్రులు నాజర్ ఆసుపత్రికి తరలింపు



2

## వక్ఫ్ సవరణ చట్టంపై కేంద్రం హామీ... సుప్రీంకోర్టులో విచారణ వాయిదా

వక్ఫ్ (సవరణ) చట్టం 2025 రాజ్యాంగబద్ధతపై పిటిషన్లపై విచారణ

## రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం



ఏపీలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు

రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

పరిశ్రమల ఆకర్షణే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 6వ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు రూ. 33 వేల కోట్లకు పైగా విలువైన 19 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడులు ప్రధానంగా ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రానున్నాయి. వీటి ద్వారా సుమారు 35 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కుతాయని అంచనా. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామికవేత్తలను తిరిగి ఆకర్షించడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. గడచిన 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఆరుసార్లు సమావేశమై, మొత్తం 76 ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ. 4,95,796 కోట్ల పెట్టుబడులు రానుండగా, 4,50,934 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా పూర్తిచేశాయి.

6వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు :

6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ. 33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

ఐ అండ్ సి డిపార్ట్‌మెంట్:

1) డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : కుమరవరం, అనకాపల్లి జిల్లా - రూ. 1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు. 2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ : పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా - రూ. 1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు. 3) పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : ఓర్వకల్, కర్నూలు జిల్లా - రూ. 1,286 కోట్ల పెట్టుబడులు,

## మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి

## - ఆందోళనలో డిపాజిటర్లు



- బీహార్ లో రాహుల్ గాంధీ పర్యటన
- దర్భంగాలో కాంగ్రెస్ అగ్రనేతను అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థులతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారిందన్న రాహుల్

ఢిల్లీ: బీహార్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, సీఎం నితీశ్ కుమార్ లపై ధ్వజమెత్తారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌లో విద్యార్థులతో 'శిక్షా న్యాయ్ సంవాద్' పేరిట తలపెట్టిన ముఖాముఖి కార్యక్రమానికి వెళుతున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల ఆటంకాలను అధిగమించి హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ, బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను పోలీసులు హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిలువరించారు. మిగతా.. 2లో

## రాష్ట్ర అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలు కలిసి రావాలి

హైదరాబాద్: రాజకీయ పార్టీల వైఖరి ఎలా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మాత్రం కలిసి రావాల్సిన అవసరం ఉందన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రానికి సహకరించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసి రావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశానికి సంబంధించి మాట్లాడిన బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్, రాష్ట్రంలోని సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని గత నెలలోనే రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు విజ్ఞప్తి చేశాను. నా విజ్ఞప్తికి రాజ్ నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం సైనిక స్కూలు ఏర్పాటు కోసం వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలు కలిసి రావాలి. ఇక్కడ రాజకీయ పార్టీల వైఖరిని పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కలిసి రావాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రానికి సహకరించలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసి రావాలని కోరుకుంటున్నా' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# చేతికి చిక్కిన భారత జవాన్‌ను చిత్రహింసలకు గురిచేసిన పాకిస్థాన్

ఢిల్లీ: పంజాబ్ సమీపంలోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద పొరపాటున పాకిస్థాన్ భూభాగంలోకి ప్రవేశించిన భారత సరిహద్దు భద్రతా దళానికి (బీఎస్ఎఫ్) చెందిన జవాన్ పూర్ణం కుమార్ షా పాక్ సైనికుల చేతిలో చిత్రహింసలకు గురైన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. 21 రోజుల పాటు పాక్ నిర్బంధంలో ఉన్న ఆయనను ఎట్టకేలకు భారత అధికారులకు అప్పగించారు. పాకిస్థాన్ అధికారులు జవాన్ పూర్ణం కుమార్ షాను అదుపులోకి తీసుకున్న తర్వాత అత్యంత దారుణంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నిర్బంధంలో ఉన్నన్ని రోజులూ ఆయన కళ్లకు గంతలు కట్టి ఉంచారని, నిద్రపోనివ్వకుండా తీవ్రంగా ఇబ్బంది పెట్టారని సమాచారం. అంతేకాకుండా పాక్ అధికారులు ఆయనను తరచూ మాటలతో దూషిస్తూ, మానసికంగా వేధించినట్లు కూడా తెలిసింది. ఈ దుర్భర పరిస్థితుల్లో మూడు వారాల పాటు నరకయాతన అనుభవించిన అనంతరం షా తిరిగి భారత గడ్డపై అడుగుపెట్టారు. అంతర్జాతీయ సరిహద్దు వద్ద విధులు నిర్వహిస్తున్న సమయంలో షా పాకిస్థాన్ భూభాగంలోకి ఎలా వెళ్లారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే, పాకిస్థాన్ అధికారులు ఒక భారతీయ సైనికుడి పట్ల వ్యవహరించిన తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా యుద్ధ ఖైదీల విషయంలో కూడా అంతర్జాతీయ నిబంధనలను పాటించాల్సి ఉండగా పొరపాటున సరిహద్దు దాటిన జవాన్ పట్ల ఇంతటి కఠినంగా ప్రవర్తించడం గమనార్హం. ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

# రాష్ట్రపతికి సుప్రీంకోర్టు డెడ్‌లైన్ ఏంటి?.. సంచలనంగా ద్రౌపది ముర్ము ప్రశ్నలు!

మొదటి పేజి తరువాయి

అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అలాగే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 గవర్నర్ అధికారాలను, బిల్లులకు ఆమోదం తెలపడం లేదా నిలిపివేయడం, రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును రిజర్వ్ చేయడం వంటి విధానాలను వివరిస్తుందని రాష్ట్రపతి హైలైట్ చేశారు. అయితే, ఈ రాజ్యాంగ ఎంపికలను ఉపయోగించుకోవడానికి గవర్నర్‌కు ఎలాంటి గడువును ఆర్టికల్ 200లో పేర్కొనలేదని అన్నారు.

### సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..

రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు నిర్దేశిస్తాయా?. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?. రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి రాజ్యాంగ విచక్షణ వినియోగం న్యాయ సమ్మతమైనదా?. రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలరు?. సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా?. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?. రాజ్యాంగంలో రాష్ట్రపతి అధికారాల మేరకు ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు సలహాను పొందడానికి లేదా గవర్నర్, రాష్ట్రపతి అనుమతి కోసం బిల్లును రిజర్వ్ చేయడం లేదా ఇతర విధంగా సుప్రీంకోర్టు అభిప్రాయం పొందడం అవసరమా? అని ప్రశ్నించారు.

# భారత్ నుంచి కీలక వాణిజ్య ప్రతిపాదన వచ్చిందన్న డొనాల్డ్ ట్రంప్

●అమెరికా ఉత్పత్తులపై సుంకాలు ఉండవంటూ భారత్

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం నాడు కీలక వ్యాఖ్యలు చేశారు. పలు అమెరికన్ వస్తువులపై ఎలాంటి సుంకాలు విధించకుండా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్ ముందుకొచ్చిందని ఆయన తెలిపారు. ఖతార్ రాజధాని దోహాలో పర్యటిస్తున్న ట్రంప్, అక్కడ వ్యాపార ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. "సుంకాలు లేకుండా వాణిజ్యం చేసేందుకు భారత్ ఒక ఒప్పందాన్ని ప్రతిపాదించింది" అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ ప్రతిపాదనకు సంబంధించిన మరిన్ని వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇదే సమయంలో, ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌తో తాను మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. భారత్‌లో మరిన్ని తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ప్రణాళికలు విరమించుకుని, అమెరికాలోనే ఆ ప్లాంట్లను విస్తరించడంపై దృష్టి పెట్టాలని సూచించినట్లు చెప్పారు. "ఆపిల్ తన ఉత్పత్తిని అమెరికాలో "పెంచనుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా, 2025 శీతాకాలం (సెప్టెంబర్-అక్టోబర్) నాటికి ఒప్పందం తొలి దశను పూర్తి చేయాలనే లక్ష్యంతో భారత వాణిజ్య శాఖ ప్రతినిధులు, అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం అధికారుల మధ్య ఏప్రిల్ 23-25 తేదీల మధ్య వాషింగ్టన్‌లో ఫలవంతమైన చర్చలు జరిగాయి. అంతకుముందు మార్చి 2025లో ఢిల్లీలో కూడా ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ వాషింగ్టన్ పర్యటన సందర్భంగా, ట్రంప్‌తో చర్చలు జరిపి, 2025 శీతాకాలం నాటికి పరస్పర ప్రయోజనకరమైన, బహుళ రంగాల ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలి దశను ఖరారు చేయాలని నిర్ణయించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసి, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలనే 'మిషన్ 500' లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఈ చర్చలు ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు, సరఫరా గొలుసుల సమైక్యతను పెంపొందించే ప్రయత్నాల్లో భాగమని వాణిజ్య మంత్రిత్వ శాఖ గతంలో పేర్కొంది.

## గాజాపై ఇజ్రాయెల్ మరోసారి

# భీకర దాడులు... 54 మంది మృతి

ఢిల్లీ: గాజా నగరంపై ఇజ్రాయెల్ మరోసారి భీకర దాడులతో విరుచుకుపడింది. దక్షిణ గాజాలో గురువారం రాత్రి జరిగిన వైమానిక దాడుల్లో 54 మంది మరణించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై ఇజ్రాయెల్ దళాలు రాత్రిపూట 10 వైమానిక దాడులు జరిపాయి. ఈ దాడుల్లో 54 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. వందలాది మంది గాయపడినట్లు చెప్పారు. క్షతగాత్రులను నగరంలోని నాజర్ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. అలాగే మృతదేహాలను ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఉత్తర, దక్షిణ గాజాపై బుధవారం జరిగిన వైమానిక దాడుల్లో 22 మంది చిన్నారులు సహా 70 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో ఉన్న సమయంలో ఇజ్రాయెల్ దళాలు గాజాపై విరుచుకుపడటం గమనార్హం. ప్రస్తుతం ట్రంప్ గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ ప్రాంతీయ పర్యటన కాల్పుల విరమణ ఒప్పందానికి లేదా గాజాకు మానవతా సహాయాన్ని పునరుద్ధరించడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై కేంద్రం హామీ...

# సుప్రీంకోర్టులో విచారణ వాయిదా

ఢిల్లీ: వక్ఫ్ ఆస్తుల విషయంలో గానీ, వక్ఫ్ బోర్డు సభ్యుల నియామకంలో గానీ ఎలాంటి మార్పులు చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు మరోసారి హామీ ఇచ్చింది. వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయడం లేదా వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చడం వంటి చర్యలు చేపట్టబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ రెండో అత్యున్నత న్యాయాధికారి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ తదుపరి విచారణ తేదీ వరకు కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. వక్ఫ్ (సవరణ) చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ ఏ.జి. మసీహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టం అమలుపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటే సుదీర్ఘ విచారణ అవసరమని పిటిషనర్లు కోరడంతో, ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. వక్ఫ్ చట్టం, 1995 చెల్లుబాటును సవాలు చేసే పిటిషన్లను స్వతంత్రంగా విచారిస్తామని కూడా ధర్మాసనం స్పష్టం చేసింది. వక్ఫ్ చట్టం దుర్వినియోగాన్ని అరికట్టేందుకే సవరణలు తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తన ప్రాథమిక అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, దేశంలోని వక్ఫ్ బోర్డుల నిర్వహణ పారదర్శకంగా జరగాలనేదే తమ ఉద్దేశమని తెలిపింది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములను కూడా వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన ఉదంతాలున్నాయని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను ఆధునికీకరించేందుకే ఈ సవరణలు తెచ్చామని, ఇవి కేవలం పరిపాలనాపరమైనవే తప్ప, ఇస్లాం మత విశ్వాసాలు లేదా ఆచారాలకు సంబంధించినవి కావని కేంద్రం వాదించింది.

వక్ఫ్ అంటే...

ఇస్లామిక్ చట్టాలు, సంప్రదాయాల ప్రకారం మసీదులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి మతపరమైన లేదా ధార్మిక ప్రయోజనాల కోసం ముస్లింలు చేసిన దానం లేదా విరాళమే 'వక్ఫ్'.

# మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి

మొదటి పేజి తరువాయి

రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను పోలీసులు హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిలువరించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినప్పటికీ, రాహుల్ గాంధీ పట్టువీడకుండా, పోలీసుల అడ్డంకులను దాటుకుని హాస్టల్‌లోకి ప్రవేశించారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని "డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్" (డబుల్ ఇంజిన్ మోసపూరిత ప్రభుత్వం) అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను ఉద్దేశించి రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. "నితీశ్ జీ, మోదీ జీ, ఆపగలిగితే ఆపండి. కులగణన తుఫాను సామాజిక న్యాయం, విద్య, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోంది," అని ఆయన హిందీలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. "బీహార్ పోలీసులు నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కానీ వారు నన్ను ఆపలేకపోయారు, ఎందుకంటే మీ (మైనారిటీ వర్గం) శక్తి నన్ను కాపాడుతోంది. దేశంలో కులగణన చేపట్టాలని మేము ప్రధాని మోదీకి చెప్పాం. మీ ఒత్తిడి వల్లే ప్రధాని మోదీ కులగణన ప్రకటించారు. మీ ఒత్తిడికి భయపడి ఆయన రాజ్యాంగాన్ని నుదుటిపై పెట్టుకున్నారు. కానీ వారి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, మైనారిటీలకు వ్యతిరేకమైనది. ఇది అదానీ-అంబానీల ప్రభుత్వం, మీది కాదు," అని రాహుల్ గాంధీ ఆరోపించారు. "భారత్‌లో, బీహార్‌లో మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, మీకు దక్కాల్సినవన్నీ అమలు చేస్తామని నేను హామీ ఇస్తున్నాను," అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ప్రశ్నిస్తూ, "బీహార్‌లోని ఎన్డీయే 'డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్' నన్ను అంబేద్కర్ హాస్టల్‌లో దళిత, వెనుకబడిన విద్యార్థులతో సంభాషించకుండా అడ్డుకుంటోంది. విద్యార్థులతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారింది? నితీశ్ జీ, మీరు దేనికి భయపడుతున్నారు? బీహార్‌లో విద్య, సామాజిక న్యాయం పరిస్థితిని దాచిపెట్టాలనుకుంటున్నారా?" అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో నిలదీశారు. "భారతదేశం ప్రజాస్వామ్య దేశం, ఇది రాజ్యాంగం ద్వారా నడుస్తుంది, నియంతృత్వం ద్వారా కాదు! సామాజిక న్యాయం, విద్య కోసం మా గొంతును వినిపించకుండా ఎవరూ మమ్మల్ని ఆపలేరు," అని ఆయన మరో పోస్ట్‌లో పేర్కొన్నారు.

# కశ్మీర్‌లో రాజ్‌నాథ్ పర్యటన.. పాక్ అణుభద్రతపై తీవ్ర ఆందోళన

మొదటి పేజి తరువాయి

"వారు (ఉగ్రవాదులు) మన తలపై దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు, మనం వారి ఛాతీపై దెబ్బకొట్టి పెద్ద గాయం చేశాం. మన 'ఆపరేషన్ సిందూర్' నిస్సందేహంగా భారత్ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక చర్య" అని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వీర సైనికులకు, ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన 26 మంది పౌరులకు ఆయన నివాళులర్పించారు. "సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని గుర్తించి నాశనం చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రతి భారతీయ సైనికుడు కన్న కల 'ఆపరేషన్ సిందూర్'. మత ప్రాతిపదికన అమాయక పౌరులను వేరుచేసి చంపడం ద్వారా మన సామాజిక ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి వారు ప్రయత్నించారు. వారి దురుద్దేశాల ఆధారంగా మనం వారిపై దాడి చేశాం" అని రాజ్‌నాథ్ వివరించారు. పాకిస్థాన్ అణు బెదిరింపులకు భారత్ లొంగిపోదని, ఉగ్రవాద లక్ష్యాలపై మనం చేసిన దాడులతో ఇది నిరూపితమైందని ఆయన అన్నారు. "పాకిస్థాన్ అణు కేంద్రాలను అంతర్జాతీయ సంస్థ స్వాధీనం చేసుకోవాల్సిన సమయం ఇది, తద్వారా వారి అణు బూటకం శాశ్వతంగా బయటపడుతుంది" అని డిమాండ్ చేశారు. మంచి ఉద్దేశాలు ఉన్నచోట శాంతి, శ్రేయస్సు ఉంటాయని, చెడు ఉద్దేశాలు ఉన్నచోట హింస, కష్టాలు తప్పవని స్వామి తులసీదాస్ 'రామచరితమానస్'లో చెప్పిన విషయాన్ని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. అలాగే, వ్యాధి సోకిన వ్యక్తికి తీపి పదార్థాలు తినిపించడం వల్ల నయం కాదని, కఠినమైన నివారణలు అవసరమని జాతీయ కవి రామ్‌ధారి సింగ్ దినకర్ చెప్పిన మాటలను ఉటంకించారు. "భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది, కానీ మన సార్వభౌమాధికారం, సమగ్రతకు సవాలు ఎదురైనప్పుడు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది" అని స్పష్టం చేశారు. తమ భూభాగాన్ని ఉగ్రవాదానికి ఉపయోగించనీయమని పాకిస్థాన్ అటల్ బిహారీ వాజ్‌పేయికి హామీ ఇచ్చిందని, కానీ ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదని రక్షణ మంత్రి విమర్శించారు. "సరిహద్దుల నుంచి ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలు జరగవనే హామీపైనే ప్రస్తుత ఒప్పందం ఆధారపడి ఉంది. మీ హృదయాల్లో, దేశంలోని ప్రతి ఒక్కరి హృదయంలో తీవ్ర ఆగ్రహం ఉందని నాకు తెలుసు. ఆ ఆగ్రహం మిమ్మల్ని అధిగమించకుండా చూసుకున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. అమాయక పౌరుల హత్యలకు సరైన లక్ష్యాలను ఛేదించడం ద్వారా మీరు ప్రతీకారం తీర్చుకున్నారు" అని సైనికులను ఉద్దేశించి అన్నారు. "ఈ రోజు పాకిస్థాన్ ఎక్కడికి చేరింది? పాకిస్థాన్ నిలబడిన చోటు నుంచే బిచ్చగాళ్ల వరుస ప్రారంభమవుతుందని అంటారు. ఐఎంఎఫ్ రుణం కోసం వారు అడుక్కున్నారు, పేద దేశాలకు ఇవ్వడానికి ఐఎంఎఫ్‌కు నిధులు ఇచ్చే దేశాలలో భారత్ ఒకటి" అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. "మన దేశంలో ఏదైనా ఉగ్రదాడి జరిగితే మన ప్రతీకారం, సందేశం చాలా దూరం వెళ్తుంది. ఉగ్రవాదంపై దేశం స్పందించే తీరును ప్రధానమంత్రి ఇప్పటికే పునర్నిర్వచించారు. ఒక కొత్త సాధారణ పరిస్థితి (న్యూ నార్మల్) సృష్టించబడింది, భారత్‌లో ఉగ్రదాడి జరిగినప్పుడల్లా దీనిని ఆశ్రయిస్తాం" అని ఆయన నొక్కిచెప్పారు. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవని ప్రధాని మోదీ స్పష్టం చేశారని, పాకిస్థాన్‌తో చర్చలు కేవలం పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) గురించి మాత్రమే ఉంటాయని రక్షణ మంత్రి పునరుద్ఘాటించారు. దేశానికి గర్వకారణంగా నిలిచిన వీర సైనికుల మధ్య ఉండటం తనకు సంతృప్తికరమైన అనుభవమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నార్తర్న్ కమాండ్ జీఓసీ-ఇన్-సీ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, 15 కార్ప్స్ జీఓసీ లెఫ్టినెంట్ జనరల్ ప్రశాంత్ శ్రీవాస్తవ, ఇతర సీనియర్ ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్‌ను తిరంగా ర్యాలీకి రావాలని పురందేశ్వరి పిలుపు

అమరావతి: ఆపరేషన్ సిందూర్, భారత జవాన్లకు సంఘీభావంగా దేశవ్యాప్తంగా బీజేపీ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో విజయవాడలోనూ తిరంగా ర్యాలీ నిర్వహించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిర్ణయించారు. రేపు (శుక్రవారం) ఈ ర్యాలీ నిర్వహించనున్నారు. విజయవాడలో ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ జరగనుంది. ఈ క్రమంలో తిరంగా ర్యాలీలో పాల్గొనాలని కూటమి నేతలను పురందేశ్వరి ఆహ్వానించారు. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆమె ఫోన్ చేసి, ర్యాలీలో పాల్గొనాలని కోరారు. దీంతో పురందేశ్వరి పిలుపు మేరకు జనసేనాని ఈ ర్యాలీలో పాల్గొంటానని చెప్పారు. ఇక, ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు కూడా పాల్గొంటారని పురందేశ్వరి వెల్లడించారు.

# రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం



మొదటి పేజి తరువాయి

1,200 ఉద్యోగాలు. 4) బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా - రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు. 5) జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా - రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలు

టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్:

6) రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ : తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా - రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు. 7) మోహన్ స్పింటెక్స్ : మాలవల్లి, కృష్ణా జిల్లా - రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు. 8) ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ : అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా - రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు.

ఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్:

9) వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి జిల్లా - రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు. 10) అలీప్ కుప్పం : చిత్తూరు జిల్లా - రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు

ఎనర్జీ డిపార్ట్‌మెంట్:

11) నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : ఏలూరు జిల్లా - రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు. 12) దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు - రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు. 13) ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : కడప జిల్లా - రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు. 14) బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు - రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలు

టూరిజం డిపార్ట్‌మెంట్:

15) బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్ పి: తిరుపతి - రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు. 16) స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి - రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు

17) వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ : విశాఖపట్నం - రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలు

ఐటీ డిపార్ట్‌మెంట్:

18) డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ, తిరుపతి జిల్లా - రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు. 19) సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : కర్నూలు జిల్లా - రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు.

# ఏపీలో 19 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం.. 35 వేల ఉద్యోగ అవకాశాలు

అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఆరు ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ జరగాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ ఎస్ఐపీబీ సమావేశం ముగిసింది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం లభించింది. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలకు సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకువచ్చాయి.రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, గదుల కొరత ఉందన్న ముఖ్యమంత్రి.. పెద్దఎత్తున హోటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని వ్యాఖ్యానించారు. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని వెల్లడించారు.

# జూన్ 21న విశాఖకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

మొదటి పేజి తరువాయి



గ్లోబల్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర-2025" నినాదంతో ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల భాగస్వామ్యంతో సుమారు 2 లక్షల మందితో రాష్ట్ర ప్రభుత్వం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ మాట్లాడుతూ విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబును ప్రభుత్వం నోడల్ అధికారిగా నియమించిందని తెలిపారు. కావున ఇప్పటి నుండే ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 8వ తరగతి నుండి డిగ్రీ, పిజి చదివే విద్యార్థులు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్ మిషన్ ప్రతినిధులు, యోగా శిక్షకులు, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్లు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్లు, పిఇటిలు, స్పోర్ట్స్ కోచ్‌లు, విశాఖలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సిఎస్ విజయానంద్ సూచించారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుండి వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను ఖరారు చేస్తామని, రెండు లక్షల టి షర్టులు, యోగా మ్యాట్లను రాష్ట్రానికి పంపనున్నట్టు చెప్పారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి యంటి కృష్ణబాబు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వేడుకల్లో సుమారు రెండు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ త్వరలో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను ఖరారు చేయనుందని చెప్పారు. విశాఖలో ఈ ఈవెంట్‌ను ఎక్కడ నిర్వహించాలనేది ఖరారు చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు. అలాగే పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, విద్య శాఖ కార్యదర్శి కె శశిధర్, సిఆర్డిఏ కమీషనర్ కె కన్నబాబు, ఐటి శాఖ కార్యదర్శి కె. భాస్కర్, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి వినయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# కేసు పెట్టి లోపల వేయిస్తా.. మహబూబ్‌నగర్ సీఈకి సీఎం వార్నింగ్!

మొదటి పేజి తరువాయి

ఉన్న వారిపై చర్యలు కచ్చితంగా ఉంటాయని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. అయితే, ఈ కేసులతో ఎలాంటి సంబంధం లేని అధికారులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ప్రాజెక్టుల నిర్మాణంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఒకటి రెండుసార్లు సరిచూసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్ల వల్ల విజిలెన్స్ కేసులు నమోదవుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో అలాంటివి జరగకుండా బాధ్యతగా పనిచేయాలని అధికారులకు ఉద్బోధించినట్లు సమాచారం. సమావేశంలో ఒప్పంద సేవల ఉద్యోగుల వేతనాల అంశాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, అవసరం ఉన్నంత వరకే కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకోవాలని, దీనిపై ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ప్రతిపాదనలు అందిన తర్వాత పరిశీలిస్తామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల (ఓ అండ్ ఎం) కోసం పెండింగ్‌లో ఉన్న బిల్లులకు నెలకు రూ.50 కోట్లు, నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ. 75 కోట్ల వరకు కేటాయింపులు చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం. శిక్షణ సంస్థ వాలంతరికి రూ.10 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులకు రూ.10 కోట్లు, దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తికి రూ.2 వేల కోట్లు అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిసింది.

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే రెండేండ్లలో 2027 జూన్ నాటికి కృష్ణాపై అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అందుకు అనుగుణంగా నిర్ణీత గడువుతో పాటు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి జలసౌధలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్టుల పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. కృష్ణా బేసిన్‌లో ప్రాధాన్యతగా ఎంచుకున్న ప్రాజెక్టులకు అవసరమైన నిధులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. భూసేకరణ వేగంగా పూర్తయ్యేందుకు రెవిన్యూ విభాగంతోనూ సమన్వయం చేసుకోవాలని, స్పెషల్ ఆఫీసర్లు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సూదిని జైపాల్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దండాపూర్ వరకు మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలని చెప్పారు. ఉద్దండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న పనులు 18 నెలల్లో పూర్తి చేయాలని, అందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక చేసుకోవాలని చెప్పారు. కోయిల్ సాగర్ లిఫ్ట్ ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలని చెప్పారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్ ప్రాజెక్టులను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులు, కావాల్సిన నిధుల వివరాలను ముఖ్యమంత్రి గారు అధికారులను అడిగి తెలుసుకున్నారు.




తెలంగాణ ప్రయోజనాలే ప్రాధాన్యతగా కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటాల సాధనకు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతం సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున.. కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి తెచ్చుకునేలా ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలని చెప్పారు. గోదావరి బేసిన్ నుంచి పట్టిసీమ ద్వారా ఏపీ తీసుకుంటున్న 90 టీఎంసీలను ఎగువన వాడుకునేలా నీటి కోటా పెంచుకోవాలని చెప్పారు. ఈ అంశాలన్నీ కృష్ణా బోర్డు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణాపై నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులకు కేటాయించిన నిర్ణీత నీటి వాటాల విషయంలో ప్రభుత్వ వాదనలు సమర్థంగా ఉండాలని అప్రమత్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టేటప్పుడు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నీటి వాటాల అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు సూచించారు.

## గజ్జెల్లి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



మంథని, మే -15(నేటిశుభోదయ దినపత్రిక): మంథని పట్టణంలోని పద్మశాలి వీధిలో గజ్జెల్లి శ్రీనివాస్ తల్లి మల్లమ్మ ఇటీవల మరణించగ వారి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించివారి కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలియజేసిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.అయన వెంట పినగాని రాయమల్లు, జంజర్ల శేకర్ ఉన్నారు.

## ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై ఇచ్చే పశువుల దానాను వినియోగించుకోవాలి

### పులిగడ్డ సర్పంచ్ విజయకుమార్




అవనిగడ్డ, మే 15 (అజయ్ నారగాని - నేటి శుభోదయ):పశువులు ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ పై పశువుల దానా సరఫరా చేస్తుందని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ అన్నారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు పశువుల దానా సరఫరా చేసిన అనంతరం మాట్లాడారు. గ్రామపంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశువర్ధక శాఖ నుండి పులిగడ్డ గ్రామంలో పశువులు ఉన్న రైతులకు పశువుల దాన సబ్సిడీపై సరఫరా చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందించే దానాను పశువుల యజమానులు వ్వ్ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని సర్పంచ్ విజయకుమార్ కోరారు. కార్యక్రమంలో పశువర్ధక శాఖ అధికారి ఏడి డాక్టర్ సాంబశివరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచేశ్వరావు, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు గార్ల చేతుల మీదిగా పశువుల దాన పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలోడాక్టర్ నాగార్జున రైతు భరోసా కేంద్రం ఇంచార్జ్ శైలజ, ల్యాబ్ అసిస్టెంట్ డేవిడ్,మండలి శేషు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల 20న జరిగే భవన నిర్మాణ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి



గుడివాడ, మే 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): దేశవ్యాప్త ఈనెల 20వ తేదీన జరిగే సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు అందరూ పాల్గొనాలని భవన నిర్మాణ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు మండల సత్యనారాయణ కోరారు. గుడివాడ భవన్ నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో గుడివాడ భవన నిర్మాణ కార్మిక సంఘం ఇతర కార్మిక సంఘాలు అన్నీ కలిపి సమావేశం నిర్వహించారు. 12 14 మెమోని రద్దు చేయాలని, సంక్షేమ బోర్డులో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిధులను వెంటనే బోర్డుకి తిరిగి జమ చేయాలని, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులందరికీ అందేలాగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేసి, 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులందరికీ పెన్షన్ అమలు చేయాలని, వివిధ రకాల డిమాండ్లతో 20వ తేదీన జరగబోయే సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుడివాడ భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు అనుబంధం పట్టణ కార్యదర్శి రేపానికొండ. సిఐటియు అనుబంధం భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు దాస్ శ్యాం ప్రసాదు. నవనిర్మాణ రాడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఏసు పోగు సుందరయ్య.ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ ప్రెసిడెంట్ డాల్ఫిన్. సెంట్రింగ్ యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణ. వడ్రంగి వర్కర్స్ యూనియన్ సెక్రటరీ కోరం రాజు. సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాము. అశోకు. ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వెంకట్రావ్ చొరవతో మురుగు సమస్య కు మోక్షం



విజయవాడ, మే 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ): గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవ తో సుదీర్ఘకాలంగా పట్టించుకోని పలు సమస్యల పరిష్కారానికి నోచుకుంటున్నాయి. గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మురుగు కాలువ పూడికతీత సమస్యకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో మోక్షం లభించింది. గన్నవరం మండలం కేసరపల్లి శివారు దుర్గాపురం లో గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్య వెంటాడుతూ ఉంది. హెచ్ సి ఎల్ గోడను ఆనుకుని ఉన్న ప్రధాన డ్రైన్ పూడిక తీయకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు దుర్గపురం కాలనీ జలమయమయ్యేది. ఇటీవల గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో దుర్గాపురం వాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి తమ కాలనీలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రధానంగా డ్రైనేజీ పూడిక తీయించి ముంపు నుండి రక్షించాలని వేడుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తక్షణమే డ్రైనేజీ పూడికి తీత పనులు చేపట్టాలని, పనులు పూర్తి చేసి తనకు ఫోటోలు పెట్టాలని గ్రామపంచాయతీ సిబ్బంది ని ఆదేశించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాల మేరకు గన్నవరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రంగంలోకి దిగి డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టి రెండు రోజులుగా శరవేగంగా పనులు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా మరుగున పడిన మురుగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగానే స్పందించి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కు దుర్గాపురం కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ సమస్య పూర్తిస్తాయి పరిష్కారం గా ఈ కచ్చా డ్రైన్ ను పక్కా డ్రైన్ గా నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చెరుకూరి వెంకటయ్యకు యర్లగర్ల హనుమంతరావు, శెట్టి రంగారావు నివాళులు

ఖమ్మం ,(నేటి శుభోదయ): రఘునాధపాలెం మండలం కోయచిలుక గ్రామ వాస్తవ్యులు చెరుకూరి వెంకటయ్య దశ దిన కర్మ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యర్లగర్ల హనుమంతరావు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, సీనియర్ లీడర్ కిలారు వెంకట రమణ, మాజీ జడ్పీటీసీ, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి దేవేందర్, సిపిఎం మహిళా నాయకురాలు జి శ్రీదేవి, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, రఘునాధ పాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రెంటాల ప్రసాద్, కోయచిలుక గ్రామ శాఖ అధ్యక్షులు మాదంశెట్టీ హనుమంతరావు, మేళ్లచెరువు సీతారాములు, నాంపల్లి శంకరయ్య, ఆళ్ల శ్రీనివాస రెడ్డి, మాదంశెట్టీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్ని చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుమారుడు కోయచిలుక గ్రామ మాజీ వైస్ చైర్మన్ చెరుకూరి పూర్ణచంద్రరావుకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేయటం జరిగింది.



## వర్షాకాలం పంటలు వేయడానికి ఇప్పటినుండే దుక్కులను సిద్ధం చేసుకోవాలి

### వేసవిలో దుక్కులను లోతుగా దున్నుకోవడం వలన రైతులకు వర్షాకాలంలో మంచి దిగుబడి వస్తుంది

### డాక్టర్ వినోద్ కుమార్ తాటికొండ, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి ఖిల్లా



( నేటి శుభోదయం)పెద్దపల్లి జిల్లా ప్రతినిధి : రామగిరి, మే-15 : వ్యవసాయం అనేది నిత్యకృత్యం రైతు లకు పనిలేని రోజు అంటూ ఉండదు. చేయాలనుకుంటే ఏ కాలంలోనైనా పనులకు కొదవు లేదు అని వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, డాక్టర్ వినోద్ కుమార్ తాడికొండ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని కాలాల్లో రైతులు పొలాల్లో బిజీగా గడుపుతుంటారని, వేసవిలో ఎండలకు భయపడి కొంత విరామం ఇస్తుంటారని, కానీ ఈ కాలంలోనూ రైతులు చేసుకోవడానికి పొలం పనులు చాలానే ఉంటాయి అన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి పంటలు వేయడానికి ఇప్పటి నుంచే దుక్కులు సిద్ధం చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమైపో వచ్చు. ఎండాకాలంలో పొలంలో చేసే పనులను బట్టే పంట దిగుబడి ఉంటుందని, వేసవిలో దుక్కులను లోతుగా దున్నుకోవడం వలన రైతులకు వర్షాకాలంలో మంచి ఫలితాలు వస్తాయని, వేసవి దుక్కులు చేయకుంటే తలెత్తే నష్టాలు, చేస్తే కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు.

### రైతులకు కలిగే ప్రయోజనాలు :

వేసవి దుక్కులు దున్నకుంటే కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి నీటిని, పోషక పదార్థాలను గ్రహిస్తూ భూసారం తగ్గడానికి కారణమవుతాయి. భూమిలోని లోతైన పొరల నుంచి కూడా తేమను తీసుకుంటూ, ఆవిరి రూపంలో బయటకు పంపుతాయి. దీని వల్ల ముడి పోషకాల కొరత ఏర్పడి తర్వాత వేసే పంటలకు అత్యధిక మోతాదుల్లో రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉంటుంది. పంట కోసిన తర్వాత దుక్కి దున్న కుండా వదిలేయడం వల్ల మళ్లీ వర్షాకాలం వచ్చిన తర్వాత భూమిని దుక్కి చేసి, సిద్ధం చేసేందుకు అలస్యమవుతుంది. దీంతో వేసవి దుక్కులు చేస్తున్న రైతు పంటను సరైన సమయాల్లో విత్తుకోలేరు.

### చీడపీడల నివారణ:

వేసవి కాలంలో చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు మొదలైనవి భూమిలో ఆశ్రయం పొందు తాయి. వేరుశనగ, చెరుకు, పండ్ల చెట్లను ఆశించే వేరు పురుగులు, అపరాలు, పత్తి, కంది మొదలైన పంటలను ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగు, బొంత పురుగు, దాసరి పురుగులు కోశస్థ దశలో భూమిలోనే ఉంటాయి. తొలకరి వర్షాలు కురిసిన ప్పుడు రెక్క పురుగులు ప్యూపాల నుంచి బయటకు వచ్చి తిరిగి పంటలను ఆశించి నష్టపరుస్తాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల నేలలో ఉన్న చీడపురుగుల కోశస్థదశలు, గుడ్లు బయటపడి ఎండ వేడికి చనిపోతాయి.

### కలుపు నివారణ:

వేసవి దుక్కులు చేయడం వల్ల బహు వార్షిక కలుపు మొక్కలైన తుంగ, గరిక, రెల్లదర్భ వంటివి నాశనమవుతాయి. కలుపు మొక్కలు ప్రత్యక్షంగా నష్టం కలిగించడంతో పాటు పరోక్షంగా చీడపీడలకు ఆశ్రయం ఇచ్చి పంట నష్టానికి కారణమవుతాయి.

### నేలలో నీటి నిల్వ :

వేసవి దుక్కులను వాలుకు అడ్డంగా చేసుకోవాలి. వాలు వెంట దున్నితే నేల కోతకు గురవుతుంది. సాళ్ల వెంట నీరు పరుగెత్తి సారవంతమైన మట్టి వాలుకు కొట్టుకుపోతుంది. వేసవి దుక్కులు చేసే ముందు పొలంలో పశువుల ఎరువు గానీ, కంపోస్ట్ గానీ, చెరువు మట్టి గానీ వెదజల్లడం వల్ల నేలకు తేమను నిలుపుకొనే శక్తి పెరుగుతుంది.

### నేల గుల్లబారడం:

వేసవిలో లోతుగా దుక్కి చేసినప్పుడు, ఆ తర్వాత తొలకరి వర్షాలకు కలి వేటర్తో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారు తుంది. పంట మొక్కల వేర్లు బాగా విస్తరించ డానికి అనుకూలంగా ఉంటుంది. మేలు చేసే సూక్ష్మాతి సూక్ష్మజీవులు గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు వానపాముల సంతతి కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

### పంట అవశేషాల సద్వినియోగం:




లోతు దుక్కి దున్నినప్పుడు పంట కోతల తర్వాత మిగిలిన పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వంటివి నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా మారుతాయి. దీంతో నేలలో సేంద్రియ శాతం, పోషక పదార్థాలు పెరిగే అవకాశం ఉంటుంది.

## న్యాచురల్ ఫార్మింగ్ వైపు రైతులను ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### తక్కువ పెట్టుబడితో మంచి పోషక విలువలతో కూడిన పంట సాగుకు చర్యలు

### న్యాచురల్ ఫార్మింగ్ రైతులకు ప్రత్యేకంగా ఆర్గానిక్ మార్కెట్ ఏర్పాటు

### న్యాచురల్ ఫార్మింగ్ పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం,(నేటి శుభోదయ): జిల్లాలో న్యాచురల్ ఫార్మింగ్ వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో న్యాచురల్ ఫార్మింగ్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. న్యాచురల్



ఫార్మింగ్ క్రింద చేపట్టిన కార్యక్రమాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. న్యాచురల్ ఫార్మింగ్ పై వ్యవసాయ క్లస్టర్ వారీగా చేపట్టిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం న్యాచురల్ గా చేసే వ్యవసాయం ద్వారా వచ్చే పంటలో పోషక విలువలు అధికంగా ఉండేవని, నేడు ఎరువులు అధికంగా వాడటం వల్ల రైతుకు పెట్టుబడి పెరగడంతో పాటు వచ్చే పంట దిగుబడిలో నాణ్యత ఉండటం లేదని, న్యాచురల్ ఫార్మింగ్ పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. మన పూర్వీకులు తిన్న ఆహారంలో ఉన్న పోషక విలువలలో నేడు మనకు కనీసం 20 శాతం మించి ఉండటం లేదని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ పై విస్తృత ప్రచారం కల్పించి, దీనికి ఆసక్తి కనబరిచిన రైతుల పొలాల దగ్గర ఫీల్డ్ సాయిల్ టెస్టింగ్ చేసే యంత్రాలు తెప్పించుకొని సాయిల్ ప్రొఫైల్ తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. పొలాలలో ఉన్న లోపాలను పరిశీలించి న్యాచురల్ గా అధిగమించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలని గుర్తించి రైతులకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. రైతులు న్యాచురల్ పద్దతులను పాటిస్తున్నార లేద వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించాలని అన్నారు. రైతులతో ఎప్పటికప్పుడు సంప్రదించేందుకు గ్రామాలలో ఇద్దరు రైతు మిత్రలను వారం రోజులలో ఎంపిక చేసుకోవాలని అన్నారు. ఒక క్లస్టర్ లో ఒక క్రాప్, రైతులను వ్యవసాయ విస్తరణ అధికారి ఎంపిక చేసుకొని అక్కడ న్యాచురల్ ఫార్మింగ్ జరిగేలా చూడాలని, 6 నెలల తర్వాత పండిన పంటకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దగ్గర ప్రత్యేక ఆర్గానిక్ మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా పండించిన పంటలు అమ్ముకునేందుకు కూడా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసే ప్రత్యేక ఆర్గానిక్ మార్కెట్ వద్ద కేవలం ఆర్గానిక్, న్యాచురల్ పద్దతులలో పండిన పంటలు మాత్రమే అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందని, ముందుగా పంట పొలాల దగ్గర పరీక్షలు నిర్వహించి, న్యాచురల్ పద్ధతిలో సాగు జరిగిందని ధృవీకరించిన తర్వాతే మార్కెట్ లో అవకాశం కల్పిస్తామని అన్నారు. మనం న్యాచురల్ ఫార్మింగ్ చేసిన తర్వాత సాయిల్ టెస్టింగ్ చేసి ఎటువంటి మార్పులు వచ్చాయో పరిశీలించాలని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ చేసే దగ్గర రెగ్యులర్ గా సాయిల్ టెస్టింగ్ చేస్తామని, రెగ్యులర్ గా సాయిల్ ప్రొఫైల్ పెరగాలని, పెట్టుబడి తగ్గి, పంట దిగుబడి పెరగాలని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా పంటలు పండించే రైతుల పద్దతులను గ్రామాలలో ఇతర రైతులకు చూపించాలని అన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ కు డిమాండ్ వచ్చిన తర్వాత గ్రామాల వారీగా కూడా మనం ఆర్గానిక్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని అన్నారు. ఆర్గానిక్ పద్ధతుల్లో సాగుచేసిన పంటలను తినడం వల్ల మన ఆరోగ్యం బాగుంటుందని దీని పట్ల ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. న్యాచురల్ పద్ధతుల్లో సాగు చేసే రైతులకు అవసరమైన పశువుల మల విసర్జనలు, ఇతర ఇన్ పుట్ పరికరాలను అందేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నామని అన్నారు. ఆర్గానిక్ ఫార్మర్ రామిరెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి వర్మి కంపోస్ట్ తయారు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆర్గానిక్ మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులు న్యాచురల్ ఫార్మింగ్ వైపు పెద్ద ఎత్తున ముందుకు వచ్చే ఆస్కారం ఉంటుందని అన్నారు. రైతులకు న్యాచురల్ ఫార్మింగ్ చేసేందుకు వీలుగా ఇన్ పుట్ యూనిట్లను అందించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, నీటిపారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఏ.ఈ.ఓలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.









## తెలంగాణాలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల అక్రమాలపై విచారణ జరిపించాలి

### ఫీజులను పెంచకుండా నిర్ణయం చేయాలి

### ఉన్నత విద్యామండలి తనిఖీల రిపోర్టును తక్షణం బహిర్గతం చేయాలి

### ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్



ఖమ్మం,(నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల అనుమతులకు సంబందించి ఉన్నత విద్యామండలి ఈ కాలంలో తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలలో అనేక లోపాలు బయటపడ్డాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులను నియమించకుండా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయటం కోసం సిలికాన్ వేలి ముద్రలని వేస్తూ అక్రమంగా అధ్యాపకులను ఎక్కువగా ఉన్నారనే పేరుతో ప్రభుత్వాన్ని ఉన్నత విద్యామండలిని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు మోసం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా అందులో కేవలం పదుల సంఖ్యలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే టిఎఎఫ్ఆర్సి నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులు సౌకర్యాలు కలిగి ఉన్నాయి. మిగతా కాలేజీలలో ఎక్కడ కూడా ఆ రూపంలో అనుమతులు లేవు. రీయంబర్స్‌మెంట్‌ను పొందాలనే దురుద్దేశంతో విద్యార్థులను చేర్పించుకోవటం కోసం కొత్త కొత్త కోర్సుల పేరుతో లక్షల రూపాయలు ఫీజులు పెంచుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా సుమారు 2 లక్షల 40 వేల నుండి ఒక లక్షా 75 వేల కాలేజీల ఫీజులు పెంచాలని ప్రతి పాదనలు తెలంగాణ అడ్మిషన్ ఫీ రెగ్యులేషన్ కమిటీ (టిఎఎఫ్ఆర్సి)కి ఇచ్చారు. ఇందులో ప్రధానంగా టిఎఎఫ్ఆర్సి దగ్గర ఈ ఫీజులు నిర్ణయించడం కోసం మేము అధ్యాపకుల మీద ఎక్కువగా ఖర్చు పెడుతున్నామని, మౌలిక వసతులు కల్పించిడం కోసం ఖర్చు పెడుతున్నామని చెబుతున్నారు. ఈ పేరుతో అనుమతులు ఇచ్చే ఉన్నత విద్యామండలిని కూడా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని వందల కోట్ల అవినీతికి పాల్పడే ప్రయత్నం చేస్తున్నారు. దీనితో పాటు సరైన సౌకర్యాలు లేకుండా అలాగే ఒకొక్క ఇంజనీరింగ్ కాలేజిలో ఒక సీటుకి ప్రధానంగా కంప్యూటర్ సైన్స్‌కి ఏటా 50 వేల సీట్లను పెంచడానికి ప్రభుత్వం దగ్గర అక్రమ పద్దతులలో అనుమతులు తీసుకుంటున్నారు. అనుమతులు తీసుకుని 14 లక్షల నుండి 20 లక్షలు అక్రమ డొనేషన్లు తీసుకుంటున్న పరిస్థితి తెలంగాణలో ఉంది. కాబట్టి తెలంగాణలో ఈ కాలంలో ఉన్నత విద్యామండలి నిర్వహించి నటువంటి తనిఖీల వివరాలను బహిర్గతం చేయాలి. ఈ రూపంలో ఇంజనీరింగ్ కాలేజీలలో ఉన్న లోపాల మీద సిఎం ఉన్నత స్థాయి కమిటీ సమీక్ష చేసి చర్యలు తీసుకోవాలి. అలాగే ఫీజులు పెంచకుండా తగ్గించే ప్రయత్నం చేయాలి. ఇంజనీరింగ్ కాలేజీల అక్రమాల నన్నింటిని బయట పెట్టి తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులందరికీ ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రయత్నం చేయాలని ఎస్ఎఫ్ఐ ఖమ్మం కమిటీ డిమాండ్ చేస్తుంది.

# గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ కి వైద్యపరీక్షలు



విజయవాడ, మే 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ముగిసిన వైద్య పరీక్షలు ముగిసాయి. శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న వంశీ - అనారోగ్య కారణాలతో బరువు తగ్గారు. వల్లభనేని వంశీని కోర్టు ఆదేశాలతో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జైలుకు తరలించారు. వంశీకి మరో పి. టి. వారెంట్ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హనుమంజంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ ఇళ్ల పట్టాల కేసు విషయంలో నూజివీడు కోర్టు నుంచి పి. టి. వారెంట్ దాఖలైంది.

## వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించెందుకే దాణా పంపిణీ

**పశుపోషకులకు దాణా బస్తాలు పంపిణీ చేసిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు**

**50 శాతం సబ్సిడీపై పశువులకు దాణా.**




విజయవాడ, మే 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): పశువుల పెంపకందారులకు పోషకాలతో కూడిన పశువుల సమీకృత దాణా బస్తాలను 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు మైలవరం శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులకు, పశుపోషకులకు రాయితీపై దాణాను అందజేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో దాణా బస్తాలను పంపిణి చేసిన అనంతరం మాట్లాడుతూ ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా 2 పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకుగాను 450 కేజీల దాణాను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రు.1,100 విలువైన 50కేజీల బస్తాను రు.555కే అందిస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాసం కొరతను అధిగమించేందుకే ఈ చర్యలు చేపట్టామన్నారు. 20 శాతం ప్రొటీన్ కలిగిన ఈ దాణాను తొలిసారి అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 21 లక్షల మంది పశుపోషకులకు లబ్ధి కలిగించేలా రూ.69 కోట్ల వ్యయంతో 31,067 టన్నుల దాణా పంపిణీకి పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఈ రాయితీ వల్ల ఆర్థికంగా అదనపు భారం పడుతున్నప్పటికీ వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించి, నిలకడగా పాడి ఉత్పత్తులు సాధించడానికి కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. అర్హులైన పశుపోషకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రుగొండ మండలంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విస్తృత పర్యటన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చంద్రుగొండ, మే 15, (నేటి శుభోదయ): చందుగొండ మండలంలో మంగయ్య బంజర, పోకల గూడెం మరియు రావికంపాడు గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ విస్తృతంగా పర్యటించి, గ్రామాల్లో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం, ఫారం పౌండ్స్, కమ్యూనిటీ పశుశాల నిర్మాణ పనులను పరిశీలించారు. చంద్రుగొండ మండలంలో పర్యటనలో భాగంగా ముందుగా కలెక్టర్ మంగయ్య బంజర గ్రామపంచాయతీ పరిధిలోని మాలోతు పకీరీ వ్యవసాయ క్షేత్రంలో నిర్మిస్తున్న పారం పౌండ్ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంపొందించడానికి, భవిష్యత్ తరాలకు నీటి ఎద్దటి నివారించడానికి ఫామ్ పౌండ్ నిర్మాణం ఎంతో ముఖ్యమని తెలిపారు.



ఈ ఫామ్ పౌండ్ నిర్మాణం ద్వారా భూగర్భ జలాల అభివృద్ధి చెందటంతో పాటు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది రైతులు ఫామ్ పౌండ్ లలో చేపల పెంపకం లో విజయం సాధించారని, అందరూ వారిని ఆదర్శంగా తీసుకొని లాభాలు గడించాలన్నారు. అనంతరం తోకల గూడెం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీల ద్వారా నిర్మిస్తున్న పొలం బాటను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న కూలీలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు అవసరమైన పలుగులు, పారలు అందజేస్తామన్నారు. కూలీలతో ముచ్చటిస్తూ వారితో పాటుగా పలుగు, పార చేతబట్టి కలెక్టర్ పని చేశారు. పోకల గూడెం పంచాయతీ పరిధిలో లో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. రావికంపాడు గ్రామపంచాయతీ నందు నిర్మిస్తున్న కమ్యూనిటీ పశుశాల పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో పలువురు రైతులు సాగు చేస్తున్న మునగ సాగును పరిశీలించి, రైతులకు అంతర్ పంటలు వేయడం ద్వారా రైతులు ఏ విధంగా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు వివరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎంపీడీవో అశోక్, ఏవో నవీన్, ఎంపీ ఓ ఖాన్, ఏపీవో శ్రీను మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ మార్నింగ్ గుడివాడ కార్యక్రమంలో పాల్గొన్న గుడివాడ మున్సిపల్ కమిషనర్ మనోహర్



గుడివాడ, మే 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): గుడ్ మార్నింగ్ గుడివాడ కార్యక్రమంలో భాగంగా గురువారం 11వ వార్డు లో ఉన్న మంచి నీటి సమస్య మరియు డ్రైనేజీ, శానిటేషన్, సమస్యలను వార్డ్ టీడీపీ ఇంచార్జి సయ్యద్ జబిన్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది, గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడివాడ అభివృద్ధి చెందుతుందని స్థానికులతో కమిషనర్ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కరిమల్లా, పట్టపు చిన్న,బాజీ బుడ, సమీ, రైజ్వాన్, రఫీ, బజని, మోబీన్, బాబావాలి, జలీల్,మున్సిపల్ మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్**



ఇబ్రహీంపట్నం మే 15(నేటి శుభోదయ): మంచాల.మండలం కేంద్రంలోని మల్లికార్జున.ఫంక్షన్ హాల్లో జరిగినలింగంపల్లి గ్రామానికిచెందిన. నర్రా. జంగయ్య. యాదవ్. కుమారుడు. వివాహ. వేడుకల్లో. పాల్గొని. నూతనదంపతులు. స్వాతి. లింగ.స్వామి. యాదవ్.ను ఆశీర్వదించిన. ఇబ్రహీంపట్నం నియోజ కవర్గం. కాంగ్రెస్. పార్టీ. సీనియర్.నాయకుడు. మాధగో నిజంగయ్యగౌడ్. సంస్థాన్. నారాయణపురం. మండలం. కాంగ్రెస్.పార్టీ. నాయకుడు.బైకని.నరేందర్. యాదవ్. మంచాల. మండలం.వైయస్.అర్.యువసేన .నాయకుడు. లొంగరి యాదగిరి.జెనిగే. మహేష్. యాదవ్. వర్ధం. నరేష్.యాదవ్.గుండె.లింగ. స్వామి. యాదవ్. బైకని.మణి వర్ధన్ యాదవ్.తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా చేరుకోవాలి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఆయిల్ పామ్ పంట సాగు లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలి**

**ప్రతి వారం ఆయిల్ పామ్ సాగు తోటల ఫీల్డ్ విజిట్**

**ప్రతి గ్రామంలో మరో 10 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేయాలి**

**కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డు లలో ఆయిల్ పామ్ సాగు లాభాలను వివరించాలి**

**ఆయిల్ పామ్ సాగు, వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం,(నేటి శుభోదయ): ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ సాగు, వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గత 8 నెలల కాలంలో ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ దాదాపు రెండింతలు చేసుకోగలిగామని, దీనికి కృషి చేసిన అధికారులకు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యాలను పూర్తి చేసిన క్లస్టర్ అధికారులను అభినందిస్తూ వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో అధికంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేసిన క్లస్టర్, తక్కువ జరిగిన క్లస్టర్ మధ్యలో గల అంతరాలను, కారణాలను తెలుసుకొని మంచి ఫలితాలు సాధిస్తున్న క్లస్టర్ లలో అనుసరిస్తున్న పద్ధతులను అందరూ పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా డీడీలు తీసిన రైతులు వచ్చే వానాకాలం ఇతర పంటలు వేయకుండా జాగ్రత్త వహించాలని, వానాకాలం నుంచి డీడీలు తీసిన రైతుల పొలాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని, రైతుల దగ్గర నుంచి డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు కూడా డీడీలు స్వీకరించి ఆ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద ఉండదని, వరదలు వచ్చినా సమస్య ఉండదని, 4 సంవత్సరాల వరకు అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుందని, తర్వాత ఎకరానికి అధిక లాభాలు వస్తాయని అన్నారు. క్లస్టర్ పరిధిలో ఉన్న పెద్ద రైతులను ముందుగా సంప్రదించి వారికి ఉన్న భూమిలో కొంత భాగంలో ఆయిల్ పామ్ పంట సాగు జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.



వ్యవసాయ విస్తరణ, హార్టికల్చర్ అధికారులు రైతుల పొలాల దగ్గరికి వెళ్లి ఆయిల్ పామ్ పండిస్తున్న రైతులతో మాట్లాడించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి తన క్లస్టర్ లోని ప్రతి గ్రామంలో కనీసం 10 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరించేలా





చర్యలు చేపట్టాలని, మనం కేటాయించిన లక్ష్యం చాలా తక్కువగా ఉందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. గ్రామంలో 100 ఎకరాలలో ఆయిల్ పంట సాగు విస్తరణ జరిగితే అక్కడ కలెక్షన్ సెంటర్ కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మన దేశంలో ఎక్కువ శాతం అవసరమైన వంటనూనె ఇతర దేశాల నుంచి వస్తుందని, మన రైతులు పండించే పంటకు తప్పనిసరిగా అద్భుతమైన మార్కెట్ ఉంటుందని, దీని గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న ధాన్యం, మిర్చి, పత్తి పంట కొనుగోలు కేంద్రాల వద్ద ఆయిల్ పామ్ ఫ్లెక్సీలు, వ్యవసాయ మార్కెట్ యార్డు లలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి ఆయిల్ పామ్ సాగు లాభాలను వివరించాలని కలెక్టర్ అన్నారు. మక్క, వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేయడం వల్ల వచ్చే ఆదాయం, ఆయిల్ పామ్ పంట వల్ల వచ్చే ఆదాయం వివరాలతో కరపత్రాలను ముద్రించాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ఆయిల్ పామ్ సాగు తోటలను రైతులు పరిశీలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. 40 మంది రైతులను సమీకరించి వారికి బస్సు ఏర్పాటు చేసి ఫీల్డ్ విజిట్ తీసుకుని వెళ్లాలని, మన జిల్లాలో వచ్చే వారం నుంచి రెగ్యులర్ గా ఫీల్డ్ విజిట్ జరగాలని,



ప్రతి క్లస్టర్ నుంచి ఫీల్డ్ విజిట్ చేసేందుకు రైతులను గుర్తించి వివరాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. మన క్లస్టర్ పరిధిలో మిర్చి క్లస్టర్ ఎన్ని ఉన్నాయో పరిశీలించి తనిఖీ చేయాలని, నర్సరీ అనుమతి ఉందా, నిబంధనలు పాటిస్తున్నారా వంటివి గమనించాలని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు పొందాలని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో నివాసం ఉండే వారి వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆయిల్ పామ్, ఉద్యానశాఖ బ్రోచర్ లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, నీటిపారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయఅధికారులు,ఏ.ఈ.ఓలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అగ్రిగోల్డ్ వెంచర్లను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలి

**కప్పలబంధంలోని అగ్రిగోల్డ్ వెంచర్ ను సందర్శించిన బాధితులు**

**కల్లూరు ఆర్.డి.ఓ కు వినతిపత్రం అందజేత**



ఖమ్మం,(నేటి శుభోదయ): అగ్రిగోల్డ్ వెంచర్లు ఆక్రమణకు గురికాకుండా ప్రభుత్వం జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా బాబు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని కప్పల బంధం వద్ద ఉన్న అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన 290 ఎకరాల వెంచర్ ను అగ్రిగోల్డ్ బాధితుల బృందం సందర్శించారు. అనంతరం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కల్లూరు ఆర్.డి.ఓ రాజేంద్ర గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల



సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో యర్రా బాబు మాట్లాడుతూ 2014లో అగ్రిగోల్డ్ కంపెనీ మూత పడినప్పటి నుండి నేటి వరకు అగ్రిగోల్డ్ వెంచర్లు ఆక్రమణకు గురైతున్నవని, అపరిచితులు కప్పలబంధం వెంచర్ లో పంటలు పండించు కుంటున్నారని, ప్రభుత్వం అగ్రిగోల్డ్ వెంచర్లను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 1995లో ప్రారంభించిన అగ్రిగోల్డ్ కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో దాదాపు 5 వేల కోట్ల రూపాయలు డిపాజిట్లు వసూలు చేసి పలు వెంచర్లు, కంపెనీలను ప్రారంభించారని తెలిపారు. 2015లో డిపాజిట్ దారులకు డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం వేసిందని విమర్శించారు. బాధితులు ఆందోళన చేయడంతో మేనేజిమెంట్‌ను అరెస్టు చేసి గత ప్రభుత్వాలు చేతులు దులుపుకున్నవని, తమ కష్టార్జీతం నష్టపోయామని, మోసపోయామని కొంతమంది డిపాజిట్ దారులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన నగదు ఐదు వందల కోట్ల రూపాయల వరకు ఉంటాయని, తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ వెయ్యి కోట్లకు పైగా ఉంటాయని వారన్నారు. అగ్రిగోల్డ్ కంపెనీ మూతపడి పది సంవత్సరాలు గడిచినా బాధితులకు న్యాయం జరగలేదని, ఇటీవల కాలంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మెమోరాండం ఇవ్వడంతో అగ్రిగోల్డ్ సమస్యపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, అగ్రిగోల్డ్ ఆస్తులన్నింటిని వేలం వేసి బాధితులకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఆదిశగా నేటి వరకు ఎలాంటి చర్యలు చెపట్టలేదని అన్నారు. వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా కార్యదర్శి ఊరుకోండ రాజు, మైలవరపు లక్ష్మి, కట్ల సతీష్, ప్రకాష్, రాజు, రాజకుమారి, కొప్పుల పామణరావు, సైదులు, బి.మురళి, పుష్ప , జాను, రవి, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కు ఫోన్ల బెదిరింపులు, చంపుతామంటూ హెచ్చరికలు ఉదయగిరిలో కలకలం



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) ఉదయగిరి/నెల్లూరు: జిల్లాలో వరుస హత్యలు జరుగుతూ పోలీసులకే సవాలుగా మారిన తరుణంలో తాజాగా ఒక డాక్టర్ని ఫోన్ ద్వారా చంపుతామంటూ హెచ్చరికలు జారీ చేయటం కలకలం సృష్టిస్తోంది. ఒకసారి కాదు రెండుసార్లు కాదు పదేపదే చంపుతామంటూ అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని డాక్టర్ వాయుగుండ్ల హజరత్ బాబు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన స్వగ్రామమైన ఉదయగిరిలో తనకు భూమి ఉందని తన భూమిలో తాను సాగు చేసుకునే క్రమంలో భూమికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులని వారు ఐదు మంది ఉదయగిరి కి చెందిన వారని వారికి నెల్లూరులోని అల్లరి మూకలతో అత్యంత సంబంధాలు కలిగి ఉన్నారని ఉదయగిరి కి వస్తే చంపుతామని రాకపోయినా నెల్లూరులోని బృందావనం వీధిలో ఉన్న విజేత కంటి వైద్యశాలకు వచ్చి పేషెంట్ల ముసుగులో లోపలికి వచ్చి చంపితే ఏం చేస్తావని ఫోనులో తరచూ బెదిరిస్తున్నారని ఆయన




ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ పేషెంట్లను కలిసే తను పేషంటుతో పాటు మరొక మనిషి తో మాత్రమే మాట్లాడవలసి వస్తుందని వారు చెప్పినదాన్ని బట్టి నాకు ప్రాణహాని ఉందని అర్థమవుతుందని జిల్లా పోలీసు ఉన్నత అధికారులు స్పందించి తనకు రక్షణ కల్పించాలని డాక్టర్ కోరుతున్నారు.

## సందిరెడ్డి జగదీష్ కు వివాహ శుభాకాంక్షలు తెలిపిన దారపనేని



నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు) : కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు సంది రెడ్డి శంకర్ శ్రీమతి పద్మ దంపతుల కుమారుడు చిరంజీవి జగదీష్, మడికొండ కాజీపేట వాస్తవ్యులు శ్రీ వెలుదండి వీరాస్వామి శ్రీమతి శోభారాణి దంపతుల కుమార్తె మేఘనల వివాహ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని చిరంజీవి జగదీష్ కు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టమనాయుని పల్లె టిడిపి నాయకులు రాయవరపు మాల్యాద్రి చౌదరి, మాజీ ఎంపీటీసీ ఝాన్సీ, ప్రముఖ బిల్డర్ దారపనేని సుబ్బారావు, పచ్చావా బాబు, తెలజాల ప్రసాద్ యాదవ్, ఉప్పుగండ్ల లింకన్, నర్ర మారెళ్ళ టిడిపి నాయకులు బిల్డర్ గుంటుపల్లి నాగేశ్వరరావు, గోగినేని వెంకటేశ్వర్లు, మేడసాని వెంకటేశ్వర్లు (సర్పంచ్), మహంకాళి ప్రకాష్ రావు, మహంకాళి మల్లికార్జున,బింగి నారాయణ, దుగ్గినేని వెంకట నరసయ్య, పెనుబాకుల ప్రసాద్ ,సంధి రెడ్డి వారి కుటుంబ సభ్యులు, మేడసాని వారి కుటుంబ సభ్యులు, రాయవరపు వారి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని చిరంజీవి జగదీష్ ను అక్షంతలతో ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

## ఏపీఆర్జేసీలో విజన్ హై స్కూల్ విద్యార్థుల హవా



యాడికి మే 15 మండలా రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( నేటి శుభోదయ తెలుగు దినపత్రిక ): మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్లో చదివిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఎంట్రెన్స్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను కనబరిచారు. 118 మార్కులతో యు.లోహిత రాష్ట్రస్థాయి లో 123 వ ర్యాంకును సాధించడం జరిగింది..అలాగే 101 మార్కులతో 1240 ర్యాంకును అన్నం దేదీప్యా,టీ.హాఫీజ్ 1163 ర్యాంకును, హెచ్ మాధవి 97 మార్కులతో 1661 ర్యాంకును, ఎం. కల్పన 97 మార్కులతో 1665 మార్కులు,బి తరణి 1793 ర్యాంకు డి విజయలక్ష్మి 2699 ర్యాంకును సాధించి రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను కనపరిచారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించడం జరిగింది..

## ఎయిడ్స్ నియంత్రణ,నివారణల పై వీధినాటక ప్రదర్శన



గుడివాడ, మే 15 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ): వీధి నాటకాల ద్వారా హెచ్. ఐ. వి. నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద నాటకాన్ని ప్రదర్శించారు.జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో కృష్ణా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సమర్పణలో గౌరవ జిల్లా కలెక్టర్ ఉత్తరువుల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని మరియు అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎయిడ్స్ మరియు లెప్రసి వారి నిర్వహణలో జిల్లాలోని ప్రజలకు హెచ్ఐవి నియంత్రణకు మరియు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు ఐసిటీసి సెంటర్లు ఏఆర్టి మందులు పిపిటిసి కేంద్రాలు మొబైల్ ఐసిటిసి కేంద్రాలు రక్తదానం తదితర వ విషయాలపై గుడివాడ కి చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ కళాకారులు వీధి నాటిక కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించి ఉన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సిబ్బంది వైద్య సిబ్బంది స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కూడా పాల్గొని ఉన్నారు.

## కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి

**కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసమరించుకోవాలి**

**ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం జయప్రదం చేయండి**

**గుంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం క్రీడా కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం జరిగింది.**



ఇబ్రహీంపట్నం మే 15 (నేటి శుభోదయ): ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ గారు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడు అమలు చేస్తుందని అన్నారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాట్ ఇస్ స్థానంలో 4 లేబర్ కోడ్ లను ముందుకు తీసుకొచ్చిందని అన్నారు. 2025-2026 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుకూలంగా కేటాయింపులు చేసిందన్నారు. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టింది అన్నారు. ఉపాధి నిరుద్యోగం అధిక ధరలు ఆకలి అసమనాథలు ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా ఈ సమస్యలను మరింత తీవ్ర రూపంలో దాల్చే ఆర్థిక విధానాలకు విచక్షణారహితంగ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య సిఐటియు యాచారం మండల కన్వీనర్ చందు నాయక్ పాల్గొన్నారు అదేవిధంగా క్రీడా కార్మికులు రాములు శివుడు శ్రీకాంత్ నరేష్ రవి రాములు వెంకటేష్ శివకుమార్ యాదయ్య తిరుమలమ్మ యశోద విజయ రాణి యాదమ్మ లక్ష్మమ్మ సుజాత నరసింహ పోచమ్మ క్రీడా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## జగతికి జీవనాడలు జానపదాలు



ఇబ్రహీంపట్నం మే 15 ( నేటి శుభోదయ): తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రజా కళావేదిక మరియు డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ మరియు కల్చర్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన మన పల్లె జానపదం జాతర కార్యక్రమంలో తాడిపత్రి గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ దారి వెంకటమ్మ కు జానపద పురస్కారం లభించింది షీల్డ్ ప్రశంస పత్రం సన్మానం జరిగింది రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన 300 మంది జానపద కళాకారులకు పాటకు పట్టాభిషేకం చేసి సన్మానించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డాక్టర్ మురళీధర్ హరి సర్వోత్తమ నాయుడు ప్రముఖ కవి ప్రిన్సిపాల్ డాక్టర్ సి నారాయణస్వామి గారు సినీ గీతా రచయిత కవి సురేంద్ర పాల్గొన్నారు ప్రజాకళావేదిక అధ్యక్షుడు అరవ జయపాల్ గారు మాట్లాడుతూ జానపదాలు జనజీవన రంజకాలు జగతికి జీవనాడులు అని తెలిపారు ఈ సందర్భంగాతాడిపర్తి గ్రామం ఫోక్ సింగర్ దారి వెంకటమ్మకు పురస్కారం లభించడం పట్ల గ్రామ ప్రజలు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు

## క్రీడలతో స్నేహభావం ఏర్పడుతుంది

**క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఏన్కూరు ఎస్సై రఫీ**



ఏన్కూరు,**(నేటి శుభోదయ):** క్రీడల వల్ల స్నేహభావం పెరుగుతుందని దీంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ఏన్కూరు ఎస్సై రఫీ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎనిమిది మండలాల స్థాయి క్రికెట్పోటీలనుఏన్కూరుఎస్సై రఫీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూక్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసంగా ఆరోగ్యకరంగా ఉంటారని, యువత క్రీడా స్ఫూర్తితో ఎదగాలని ఆయన అన్నారు. అనంతరం క్రికెట్ క్రీడాకారులను పరిచయం పరిచయం చేసుకున్నారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, ముక్తి వెంకటేశ్వర్లు, మేడ ధర్మారావు, పూర్ణ కంటి మైసరావు, తాళ్లూరి నవీన్, ఏన్కూరు క్రికెట్ క్లబ్ నిర్వాహకులు , క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.



## పందుల నుండి ప్రజలకు ముప్పువాటిల్ల కుండా చర్యలు చేపట్టాలి

**ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ గీతాంజలి శర్మ**



మచిలీపట్నం, మే 15 (అజయ్ నారగాని - నేటి శుభోదయ): పట్టణాల పరిధిలో పందుల నుండి ప్రజలకు ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ చాంబర్లో పందుల వలన కలిగే ముప్పు నివారణ పై సంబంధిత అధికారులు, పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లాలో పందుల వలన ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా ఉంటారని, జిల్లా పశుసంవర్ధక అధికారి, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ, సాంఘిక సంక్షేమ అధికారి, ఎస్టీ సంక్షేమ అధికారి, మెప్మా పీడీ సభ్యులుగా ఉంటారన్నారు. పందుల పెంపకందారులు పందులను పట్టణాల్లో ,ఎక్కడపడితే అక్కడ పెంచకుండ, వీధుల్లో తిరగకుండా ఊరికి దూరంగా ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. మహిళల స్వయం సహాయక సంఘాల మాదిరిగా ఒక సంఘంగా ఏర్పడితే వారికి ప్రభుత్వం తరపున స్థలం గుర్తించి లీజుకు గాని, అమ్మకానికి గాని ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థలం గుర్తించడం కోసం మచిలీపట్నం ఆర్డిఓతో మాట్లాడతామన్నారు ఈ సందర్భంగా పందుల పెంపకందారు కందుల శీను మాట్లాడుతూ మచిలీపట్నంలో 50 మంది దాకా పందుల పెంపకందారులు ఉన్నారని, తమకు స్థలం ఇస్తామన్నారు కానీ ఇంకా ఇవ్వలేదని, కరోనా వచ్చిన తర్వాత చాలా పందులు వ్యాక్సిన్ వేసినప్పటికీ చనిపోతున్నాయని, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో గతంలో 3,650 పందులు ఉండేవని, ప్రస్తుతం 2,500 కు తగ్గిపోయాయన్నారు. తమ శాఖ వద్ద స్వైన్ ఫ్లూ టీకాలు (వ్యాక్సినేషన్లు) అందుబాటులో ఉన్నాయని, వాటిని పందులకు క్రమం తప్పకుండా వేస్తున్నామన్నారు. పందులు కలుషిత ఆహారం, రసాయనిక ఆహారం తినడం మూలాన సుస్థిరత్వం కోల్పోయి చనిపోవడం జరుగుతోందన్నారు. అనంతరం ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ పందుల పెంపకందారులు సంఘాలు ఏర్పడ్డాక వారికి పశుసంవర్ధక శాఖ పరిధిలో జాతీయ ప్రాజెక్టుల పథకం కింద ఆర్థిక సహాయం అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు.అలాగే వార్డు సచివాలయాల పరిధిలో పందుల పెంపకందారులను గుర్తించి వారితో మున్సిపాలిటీ పరిధిలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలను వివరించి వారి సమస్యలను తెలుసుకుని, వారికి కావలసిన మంచి బ్రీడ్లు, స్థలం తదితర జీవనోపాదులకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వారిలో ఎస్సీ ఎస్టీలను గుర్తించి మెప్మా పరిధిలో కూడా బ్యాంకుల నుండి ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వివి నాయుడు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, పెడన, తాడిగడప మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్, వెంకటేశ్వరరావు, గోపాలరావు, భవాని ప్రసాద్, డి టి డబ్ల్యూ ఓ ఫణి ధూర్జటి, పందుల పెంపకందారులు కందుల శీను, కే. నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మాస్టర్ ప్లాన్ త్వరలో ఆమోదం

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధి 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్ లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**



ఖమ్మం,**(నేటి శుభోదయ):** నగరం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేసి ప్రభుత్వంచే ఆమోదింప చేసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల

















నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్ లో టి.యు.ఎఫ్.ఐ. డి.సి. నిధులు 72 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ సంబంధించిన భూ సమస్యల అంశాలను అదనపు కలెక్టర్, మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలను కమీషనర్ బాధ్యత తీసుకొని పరిష్కరించాలని అన్నారు. ఖమ్మం నగర అభివృద్ధి మాస్టర్ ప్లాన్ త్వరలోనే ఆమోదించడం జరుగుతుందని, ఫైనల్ చేసే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదిస్తామని అన్నారు. ఖమ్మం మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందిన తర్వాత పెండింగ్ భవన నిర్మాణాలు అనుమతులు త్వరగా జారీ చేయాలని అన్నారు. ప్రభుత్వ భూములను రక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. నగర అభివృద్ధికి మనమంతా సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. నగరంలో పేద ప్రజలకు మధ్య తరగతి వారికి ఏం కావాలో ఒక్కొక్కటిగా పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని, ప్రశాంతమైన ప్రగతి సాధించిన ఖమ్మంను తయారు చేస్తామని అన్నారు. పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేస్తూ అభివృద్ధి పనులను కూడా ఎక్కడ వెనకాడకుండా పూర్తి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామని, వచ్చే వారం నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 58 ప్రకారం పట్టాలు సంబంధించి రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ వెరిఫికేషన్ చేస్తున్నామని, ఇది పూర్తయిన తర్వాత ప్రత్యేక రెవెన్యూ క్యాంపెయిన్ నిర్వహించి అర్హులకు ఇంటి పట్టాలు, హౌస్ నెంబర్ కేటాయిస్తామని అన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు కూడా కోర్టు ఆదేశాల ప్రకారం ఏడి సర్వే అండ్ ల్యాండ్ అధికారులతో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం అందిందని, రేపటి వరకు దానిని స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పూనుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతీమా జోహారా, స్థానిక కార్పొరేటర్ త అధికారులు, ప్రశాంతి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, సంబంధితదితరులు పాల్గొన్నారు.

## స్కాన్ చేయండి ప్రభుత్వ సేవలు పొందండి

**ఎల్ బ్రహ్మయ్య (ఎంపీడీవో పామూరు)**



నేటి శుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు): ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే కాన్సెప్ట్ లో భాగంగా ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ను ఏర్పాటుచేసి ప్రభుత్వ సేవలను క్యూఆర్ కోడ్ కు స్కాన్ చేసి సేవలు పొందేందుకు అవకాశం కలిగిందని పామూరు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేవలం వాట్సాప్ ద్వారానే ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు అందడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పామూరు పట్టణ కాపు నాయకులతో సమావేశమైన ఈవో శ్రీ గిరి రాజు



నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి /పామూరు): జూన్ 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని కాపు సామాజిక వర్గం నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై ఉభయాలు, తదితర అంశాలను చర్చించిన దేవస్థాన ఈవో శ్రీ గిరిరాజు నరసింహబాబు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గడచిన 17 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాలు నిర్వహించలేకపోయామని, నేడు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో, పట్టణంలోని వివిధ సామాజిక వర్గాల నాయకుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిపేందుకు నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, పాలపర్తి రమణయ్య, గుత్తి రాజా, ఆకుపాటి వెంకటేష్, పిడుగు శ్రీనివాసులు, వాయినేని రాఘవ, గుత్తి మహేష్, గద్దె సుధాకర్, జంకాల ఓబులేసు, గుర్రం వెంకటేశ్వర్లు, వల్లంశెట్టి సుధాకర్, వాయినేని మాల్యాద్రి, కటకం శివ తదితరులు పాల్గొన్నారు



# అక్రమ ఫైనాన్స్, చిట్స్ నిర్వహిస్తున్న వ్యాపారుల ఇండ్లలో సోదాలు

**62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు స్వాధీనం ఆరుగురిపై కేసు నమోదు**



**ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి**

ఖమ్మం, **(నేటి శుభోదయ):** నిబంధనలకు విరుద్ధంగా చిటీలు, ఫైనాన్స్, గిరిగిరి వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇండ్లలో ఖమ్మం టౌన్ డివిజన్ పోలీసులు సోదాలు నిర్వహించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పాకబండ బజార్, టిన్జీవోస్ కాలనీ, వేణుగోపాలనగర్, పంపింగ్ వెల్ రోడ్డు,గాంధీనగర్, అల్లీపూరం, కొత్తగూడెం, మంచుకొండ ప్రాంతాలలో నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆనాధికార చిట్స్, అధిక వడ్డీలతో ప్రజలను పీడిస్తున్న ఫైనాన్స్, గిరిగిరి వ్యాపారుల ఇండ్లలో ఏకకాలంలో ఎనిమిది చోట్ల దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. లక్షల విలువ చేసే 62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు, 12 చిట్టి బుక్స్ లభ్యమయ్యాయినట్లు తెలిపారు. చిట్ నిర్వహుకులు తమ కస్టమర్ల నుండి సేకరించిన డబ్బును చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న చిట్స్, ఫైనాన్స్ వ్యాపారుల ఇండ్లలో తనిఖీ చేసి ఆరుగురిలో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించి వారిపై ఖమ్మం వన్ టౌన్ ,టూ టౌన్, ఖ?నపూరం హవేలీ,రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలను అసరగా తీసుకొని గిరిగిరి పేరుతో అధిక వడ్డీ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ హెచ్చరించారు. ఎవరైనా ఆనాధికార చిట్టిలు, అక్రమ ఫైనాన్స్, గిరిగిరి నిర్వహిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# శిరిగిరి వారి ఓణీల వేడుకలో పాల్గొన్న

**పువ్వాడి,బొల్లా,నీరుకట్టు,అడుసుమల్లి**



నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర) ( కనిగిరి/ పామూరు): పామూరు మండలం తూర్పు కట్టకిందపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కరోళ్ళపాడు గ్రామంలో జరిగిన శిరిగిరి వారి ఓణీల వేడుకలో పాల్గొని చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, టిడిపి సీనియర్ నాయకులు నీరు కట్టు హరిబాబు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి శ్రీనివాసులు, దైర్దే శంకర్, మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి, మాల్యాద్రి, పొకా వినోద్ తదితరులు పాల్గొన్నారు

# సీడ్ కంపెనీలకు మంత్రి సీతక్క హెచ్చరిక

**రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం**









హైదరాబాద్,**(నేటి శుభోదయ):** హైదరాబాదులోని అగ్రికల్చర్ డైరెక్టరేట్ కార్యాలయంలో విత్తన కంపెనీల ప్రతినిధులతో మంత్రి సీతక్క సమావేశం అయ్యారు. వాజేడు, వెంకటాపూర్ మండలాలతో పాటు కన్నాయి గుడెంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించాలని కంపెనీ ప్రతినిధులను మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ పక్షంలో కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి, క్రిమినల్ చర్యలు చేపడుతామని హెచ్చరించారు. విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ములుగు జిల్లా కలెక్టర్ దివాకరా, పలువురు వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా పలు సీడ్ కంపెనీల తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులను సమన్వయం చేసి నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంటలను, రైతులను వివరాలను సేకరించి అనుగుణంగా రైతులకు కంపెనీల ద్వారా నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. నకిలీ విత్తనాలను సరఫరా చేసే సహించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్లో వేస్తామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

**క్లబ్ అధ్యక్షుడు పద్మ శ్రీనివాస్**




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 15 (నేటి శుభోదయ): రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాదు రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు.క్లబ్ ప్రతినిధులు 17 మంది ఈ సందర్భంగా రక్తదానం చేశారు.క్లబ్ అధ్యక్షుడు పద్మ శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమని అన్నారు.ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకురావాలన్నారు. తమ క్లబ్ సభ్యుడు కోటగిరి చంద్రశేఖర్ వంద సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారనిఅభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆర్.గౌరీ శంకర్,సూర్యప్రకాష్, బి.వీరబ్రహ్మం,జి.రమేష్,డాక్టర్ వినోద్ పవార్,చంద్రశేఖర్,శ్రీనివాస్, రాజశేఖర్,నేతి శేఖర్,రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి, నిర్మాణ పనులకు ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్







ఖమ్మం,**(నేటి శుభోదయ):** జిల్లాలో పలు అభివృద్ధి, నిర్మాణాల పనులకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్, రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. ప్రభుత్వం చేపట్టే నూతన నిర్మాణాలకు స్థల సేకరణ కోసం పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. టిటిడి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం కోసం పువ్వాడ ఉదయ్ నగర్ గుట్ట పైకి ఎక్కి అనువైన స్థలం, రహదారికి మార్గాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జింకలతండా, పువ్వాడ ఉదయ్ నగర్ ల పూర్తిస్థాయి స్థలాల మ్యాప్ లను సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ఇక కేంద్రం ఆధీనంలోకి 'ఉపాధిహామీ పథకం'



హైదరాబాద్,**(నేటి శుభోదయ):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇక పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లిపోనుంది. రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ సైతం ఉండకుండా 'కేంద్రం' అంతా తానై పథకాన్ని నడపనుంది. ఉపాధి హామీ పథకానికి ఏటా కేంద్రం బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తోంది. అయితే, నిధుల ఖర్చు, పనుల గుర్తింపు తదితర వాటిని అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేది. దీంతో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసు కుంటున్నాయనే విమర్శలున్నాయి.ఈ క్రమంలో అక్రమాలు అరికట్టి పారదర్శకంగా పథకాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'యుక్తధార్' పేరిట యాప్ తీసుకొచ్చింది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద ఖమ్మం జిల్లాలోని 22 మండలాల్లో మండలానికి ఒక పంచాయతీ చొప్పున 22 చోట్ల 'యుక్తధార్' పోర్టల్ ద్వారా ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు.యాప్‌పై అవగాహన కల్పించేందుకు ఉపాధి హామీ సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నారు.

## సర్వం యాప్ ద్వారానే

ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి పనుల గుర్తింపు దగ్గర నుంచి పనులకు వచ్చే కూలీల వివరాలు, బిల్లుల చెల్లింపులు తదితరాలన్నీ 'యుక్తధార్' యాప్ ఆధారంగానే జరగనున్నాయి. జియోస్పేషియల్ ప్లానింగ్ పోర్టల్‌కు అనుగుణంగా 'యుక్తధార్' పనిచేస్తుంది. ఈ క్రమంలో ఉపాధి పనులను గుర్తించిన అనంతరం వాటిని జియోట్యాగ్ ద్వారా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. పనులకు వచ్చే కూలీల వివరాలు సైతం పొందుపరచాలి. జియోట్యాగ్ చేసిన పనుల వద్దే కూలీల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ క్రమంలో అవకతవకలకు తావుండదు. కూలీలకు వేతనాలు కూడా త్వరగా విడుదలవుతాయి. కేంద్ర ప్రభుత్వ చర్యలతో గ్రామ పంచాయతీల్లో ప్రణాళికలు సులభతరం కానున్నట్లు డ్వామా అధికారులు చెబుతున్నారు.

అక్రమాలను అరికట్టేందుకు చర్యలు
ప్రత్యేకంగా 'యుక్తధార్' యాప్
పనుల గుర్తింపు, బిల్లుల చెల్లింపులు సైతం యాప్ ద్వారానే
22 పంచాయతీల్లో యుక్తధార్ ద్వారా పనులు

పైలట్ ప్రాజెక్టు కింద జిల్లా వ్యాప్తంగా ఉన్న 22 మండలాల్లో మండలానికి ఒక పంచాయతీ చొప్పున 22 గ్రామ పంచాయతీల్లో 'యుక్తధార్' పోర్టల్ ద్వారా ఉపాధి హామీ పనులను చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యుక్తధార్ యాప్‌నకు అనుసంధానం చేసింది. పనుల గుర్తింపు దగ్గర నుంచి బిల్లుల చెల్లింపు వరకూ అన్ని వివరాలు ఈ యాప్ ద్వారానే నడవనున్నాయి. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో అన్ని పంచాయతీల్లో అమలు చేయనున్నారు.

# జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు**

**80 శాతానికి పైగా పనులు పూర్తి**

**గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి తుమ్మల**





ఖమ్మం,**(నేటి శుభోదయ):** జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల



మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, అధికారులతో కలిసి వేంసూరు నుండి ధాంసలాపురం వరకు ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే గుండా ప్రయాణిస్తూ, క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే జిల్లాలో 3 ప్యాకేజులుగా విభజించి పనులు పురోగతి లో ఉన్నాయన్నారు. పనులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి, సమస్యలు గురించి తెలుసుకోవడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. జులై 15 కల్లా పూర్తిస్థాయిలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. ప్యాజేజి-1 క్రింద తల్లంపాడు నుండి సోమవరం వరకు 30 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం రూ. 772.11 కోట్ల అంచనాలతో చేపట్టగా, 75 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఇట్టి ప్యాకేజీలో 32 స్ట్రక్చర్లు ఉండగా, 29 పూర్తయ్యాయని తెలిపారు. ధాంసలాపురం వద్ద ఎన్ఎస్పి కాల్వలో పిల్లర్ల విషయమై అలైన్మెంట్ లో కాస్త ఆలస్యం అవగా, ప్రస్తుతం పనులు వడివడిగా సాగుతున్నాయన్నారు. ప్యాకేజి-2 క్రింద సోమవరం నుండి చింతగూడెం వరకు 27 కి.మీ. మేర రూ.



637.11 కోట్ల అంచనాలతో పనులు చేపట్టినట్లు, ఇప్పటివరకు 81 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇట్టి ప్యాకేజీలో 39 స్ట్రక్చర్లకు గాను 35 నిర్మాణాలు పూర్తయినట్లు ఆయన అన్నారు. ప్యాకేజి-3 క్రింద చింతగూడెం నుండి రేచర్ల వరకు 38 కి.మీ. మేర రూ.



804.69 కోట్ల వ్యయ అంచనాలతో పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 85 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఈ ప్యాకేజి కి సంబంధించి 55 స్ట్రక్చర్లు ఉండగా, 51 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. పనుల పురోగతికి ఎటువంటి సమస్యలు లేవని, అన్ని



ప్యాకేజీలలో పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీస్ రోడ్ విషయమై ప్రతిపాదనలు సమర్పించి, మంజూరు చేయిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాంత మంత వ్యవసాయ ప్రాంతం కావున, సర్వీస్ రోడ్ చాలా అవసరమని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే లో సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 3 ఎక్జిట్లు ఉన్నాయని, దేశంలోని ఏ రాష్ట్రంలోని నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే లో 3 ఎక్జిట్లు లేవని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే, ప్రయాణ సమయం ఎంతో ఆదా అవుతుందని, రవాణా వ్యవస్థ మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, నేషనల్ హైవే పిడి దివ్య, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఇంటూరి నాగేశ్వరరావు



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (కందుకూరు /నెల్లూరు): ఇటీవల హత్యకు గురైన తెలుగుదేశం పార్టీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబోలు గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ని హెలిప్యాడ్ వద్ద జిల్లా మంత్రులు, సహచర శాసనసభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు

# రమేష్ ఎయిర్ ట్రావెల్స్ ప్రారంభించిన

**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర ) (కందుకూరు/ నెల్లూరు): కందుకూరు పట్టణంలోని కనిగిరి రోడ్ లో కేశినేని రమేష్ ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన రమేష్ ఎయిర్ ట్రావెల్స్ ను గురువారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా మీరు ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ ప్రజల మన్ననలు పొందాలని మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ముందుగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి కేశినేని రమేష్ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మేడా మల్లికార్జున, నల్లబోతుల మురళి, అత్తోట మధుబాబు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# ఉలవపాడు లో బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (ఉలవపాడు /కందుకూరు): మండల కేంద్రం ఉలవపాడు లోని వైయస్సార్ విగ్రహం దగ్గర గురువారం మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బుర్రామధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు మండల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యంలో ఘనముగా కేక్ కట్ చేసి, తదనంతరం కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు అల్పాహారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు ప్రజా ప్రతినిధులైన ఎంపీటీసీ సభ్యులు రాధా మాధవి కో ఆప్షన్ సభ్యులు ఖాదర్బాషా జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల అధ్యక్షులు ఆదాం సీనియర్ నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య రాజశేఖర్ రెడ్డి జే సి ఎస్ కన్వీనర్ ధనకోటి నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నవీన్ ,ఐ టీ వింగ్ అమర్నాథ్ రెడ్డి మాజీ సర్పంచ్ జై రామ్ హరిబాబు మండల కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి వెంకటేశ్వర్లు సుబ్బారావు రత్నం రమేష్ వర్మ శ్రీను మధు సుల్తాన్ దస్తగిరి వెంగళరావు వెంకటేష్ సుధాకర్ ప్రకాశం రాము బాలకోటయ్య షాహుల్ శ్రీహరి మాదవ వాలెంటర్ వింగ్ రాంబాబు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేసినందుకు, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

# సరస్వతి పుష్కరాలలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్







భూపాలపల్లి,**(నేటి శుభోదయ):** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మంత్రివర్యులు శ్రీధర్ బాబు ,పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పలువురు ఎమ్మెల్యేలతో కలసి పాల్గొన్న ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ ఉన్నత అధికారులు, ఆలయ అర్చకులు, భారీ సంఖ్యలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా పేదలకు చెప్పులు,మజ్జిగ పంపిణీ



నేటిశుభోదయ ( ఏపీ బ్యూరో చంద్ర) (కందుకూరు/నెల్లూరు): చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం అనే నినాదంతో శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యురాలు పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండే కొంత మంది పేదలకు చెప్పులు పంపిణీ చేయడం జరిగింది.మరియు నిరాశ్రయులకు,యాచకులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు అధ్యక్షులు సేవా హృదయ రవ్వా శ్రీనివాసులు (ఎల్. ఐ.సి అండ్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ), సభ్యులు గుర్రం చిన్న అల్లూరయ్య (కోదండ రామాలయం మెంబర్) పాల్గొన్నారు.

## ఆహారం పంపిణీ చేసిన ఐ.ఎఫ్.సి ఫౌండేషన్





నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (కందుకూరు/నెల్లూరు) : కందుకూరు పట్టణంలో గత కొన్ని సంవత్సరాలుగా కుల మతాలకతీతంగా చేస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం కందుకూరు పట్టణంలో ఒక వివాహ మహోత్సవ కార్యక్రమంలో ఆహారం మిగలగా ఆ ఆహారాన్ని వృధా చేయకూడదు అని మంచి సహృదయమైన ఆలోచనతో ఐఎఫ్సి ఫౌండేషన్ వారికి సమాచారం అందించారు. ఫౌండేషన్ వారు వెళ్లి ఆహారాన్ని సేకరించి ఊరి బయట నివాసం ఉండే పేదవారికి ఆహారాన్ని పంపిణీ చేశారు. పేదవారికి ఆహారాన్ని అందించిన ఆ పెళ్లి వారికి ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా మంచి ఆలోచన చేస్తే పేదవారికి ఎంతో మేలు జరుగుతుందని ఫౌండేషన్ సెక్రటరీ షంషేర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సాజిద్, ట్రెజరర్ హాఫీజ్, ఇంచార్జ్ అయూబ్ ఖాన్ ,షంషుద్దీన్,రమణయ్య పాల్గొన్నారు.

## శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

### గ్రంథ పాలకుడు డి కోటేశ్వరరావు



నేటి శుభోదయ( ఏపీ బ్యూరో చంద్ర ) (ఉలవపాడు/కందుకూరు): ఉలవపాడు శాఖా గ్రంథాలయం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంథ పాలకుడు డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ముందుగా నీతి కథలు,స్పోకెన్ ఇంగ్లీష్ చెప్పించి అనంతరం ఇంగ్లీష్ డిక్టేషన్ పోటీలు నిర్వహించారు.ఈ వేసవి కాలంలో కూడా పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న వారి తల్లిదండ్రులకు గ్రంథపాలకుడు కృతజ్ఞులు తెలిపారు. గురువారం కార్యక్రమానికి దాత పాలపర్తి రవీంద్ర బాబు పాస్టర్ పిల్లలకు స్నాక్స్ అందించి వారి ప్రేమకు పాత్రులైనారు.

## వధువు వెంకట స్వర్ణలత పరిణయ వేడుకలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర)( సీతారాంపురం/ఉదయగిరి): సీతారాంపురం మండలం బోడ సిద్దాయి పల్లె గ్రామానికి చెందిన బందుగల రమణయ్య శ్రీమతి పద్మావతి కనిష్ట పుత్రిక చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి వెంకట స్వర్ణలత పరిణయ మహోత్సవంలో గురువారం ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. వధువు వెంకట స్వర్ణలతను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ , సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యములతో, నిండు జీవితం వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు నాయకులు బంధుమిత్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం మండల నాయకులు గ్రామ నాయకులు బంధుమిత్రులు ఉన్నారు.



## కనిగిరి నియోజకవర్గం

## వైయస్ఆర్ సీపీ నాయకులకు,కార్యకర్తలకు ఆహ్వానం

### దద్దాల నారాయణ యాదవ్ (కనిగిరి వైసీపీ ఇంచార్జ్)



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (కనిగిరి/పీసీ పల్లి): పాలేటి గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా లిఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఏర్పాటు చేసిన ప్రభలలో ముఖ్య అతిధిలుగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేయల్లి వెంకాయమ్మ, జిల్లా పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి , ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మార్కాపురం ఇంచార్జి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే విశాఖజిల్లా పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు , ఒంగోలు ఇంచార్జి చుండూరి రవిబాబు,మాజీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్య నారాయణ రెడ్డి పాల్గొంటారు. కావున వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,భక్తులు అందరూ విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని దద్దాల కోరారు.

## పామూరు మండల టిడిపి ఉపాధ్యక్ష రేసులో తడికమళ్ళ



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (కనిగిరి /పామూరు): పామూరు మండల టిడిపి సీనియర్ నాయకులు, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు తడిక మళ్ళ వెంకట సుబ్బారావు పామూరు మండలం టిడిపి ఉపాధ్యక్షులు గా అనూహ్యంగా రేసులోకి వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు సామాజిక వర్గాల నాయకులు మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, స్థానిక నాయకుల ఆశీస్సులతో పామూరు మండల ఉపాధ్యక్షులు గా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ

### తహశీల్దార్లు పున్నంచందర్, రాంబాబు లు
### భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
### బోనకల్ మండలం ఆళ్లపాడు, చిన్నబీరవల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్లు

ఖమ్మం, బోనకల్,**(నేటి శుభోదయ):** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల



పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నం చందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. మంగళవారం బోనకల్ మండలం ఆళ్లపాడు, చిన్నబీరవల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు





నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు



పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో



లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆళ్లపాడు గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 185, చిన్నబీరవల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో 141 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 15 (నేటి శుభోదయ) : రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కరిక్యులర్ అండ్ థెరపిక్ స్ట్రాటజీస్ ఫర్ సీడబ్ల్యూఎస్ఎన్ (చైల్డ్ విత్ స్పెషల్ నీడ్) అంశంపై ఐదు రోజుల శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శిక్షణ తరగతులను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి,బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చే దిశగా ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇస్తున్న తీరును పరిశీలించారు.ప్రత్యేకించి గణితం,ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్న అంశాల గురించి స్టేట్ రిసోర్స్ పర్సన్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో, ఆకట్టుకునే విధంగా పాఠాలను ఎలా బోధించాలి,అభ్యాసన సామర్థ్యాలను ఎలా పెంపొందించాలి అనే దానిపై అందిస్తున్న శిక్షణను కలెక్టర్ ఆయా తరగతి గదులను సందర్శించి పరిశీలించారు, వెనుకబడిన విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తల గురించి స్టేట్ రిసోర్స్ పర్సన్లు అవగాహన కల్పించారు.శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని, నేర్చుకున్న అంశాలను తరగతి గదులలో పాటిస్తూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను బోధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులకు హితవు పలికారు. విద్యార్థులను తమ సొంత బిడ్డలుగా భావిస్తూ, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు.కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్,ఇతర అధికారులు ఉన్నారు.

## ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

### టిపిసిసి? కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర శ్రావణ్ రెడ్డి



కేశంపేట ప్రతినిధి (నేటి శుభోదయ): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతూ విధి నిర్వహణలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాండ్ర శ్రావణ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పశుసంవర్ధక శాఖలో ఖాళీలను భర్తీ ప్రక్రియ నిర్వహించిందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మండలంలోని ఏ ఎక్లాస్ ఖాన్ పేట, కొండారెడ్డి పల్లి, పాపిరెడ్డి గూడ గ్రామాల్లో ఉన్న పశు వైద్య ఉప కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది నియమించిందని ఆయన అన్నారు. పాపిరెడ్డి గూడ గ్రామంలో ఉన్న పశు వైద్య ఉప కేంద్రంలో గురువారం లైవ్ స్టాక్ అసిస్టెంట్ గా స్వప్న విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర తాండ్ర శ్రావణ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ... రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో అవినీతికి ఆస్కారం లేకుండా ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలలో పాడి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం, రైతుల కోసం కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పశు వైద్య సిబ్బందిని కేటాయించేందుకు కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శివయ్య, అబ్బి సుందరయ్య, యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ మండల అధ్యక్షురాలు రాణి, రవీందర్, ఆంజనేయులు, సత్యం గౌడ్, రామస్వామి, రామచందర్, బిక్షపతి, కృష్ణయ్య, శ్రీను, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ కోసం గ్రామసభలు



ఏన్కూరు, **(నేటి శుభోదయ):** ఏన్కూర్ మండల పరిధిలోని నాచారం, మేడేపల్లి, హిమాంనగర్ గ్రామాల్లో సీతారామ ప్రాజెక్టు లింక్ కాలువ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై రెవెన్యూ అధికారులు



గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఎస్ఆర్ఎల్పి డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ-2 వివరాలను రైతులకు సమగ్రంగా వివరించారు. తహసీల్దార్ సిహెచ్ శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభల్లో ఆర్ఐ శ్రీనివాసరావు, ఇరిగేషన్ సహాయ ఇంజనీర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లతో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరికాయలపాడు లో బీపీ-షుగర్ పరీక్షలు



ఏన్కూరు ,**(నేటి శుభోదయ):** ఏన్కూరు మండల పరిధిలోని ఆరికాయలపాడు గ్రామంలో గురువారం ఆరోగ్య, పోషణ, స్వచ్ఛత కమిటీ సమావేశం జరిగింది. రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలతోపాటు మందులు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా వడదెబ్బ నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో లచ్చగూడెం పల్లె దవాఖాన్ ఇంచార్జ్ ప్రతిభా భారతి, పంచాయతీ కార్యదర్శి దారావత్ అమల, ఏఎన్ఎం శిరోమణి, ఆశ వర్కర్ అరుణ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వసతులతో తలకొండపల్లి జూనియర్ కళాశాల

### ప్రభుత్వ జూనియర్ కళాశాలను కాపాడుకుందాం
### తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు చేర్పిద్దాం
### తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ ముదిరాజ్

తలకొండపల్లి **(నేటి శుభోదయ):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ విద్యార్థులు కు అడ్మిషన్లు ప్రారంభం జరుగుతున్నాయని శుక్రవారం విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ మాట్లాడుతూ,,తలకొండపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాల కోసం కొన్ని సంవత్సరాలుగా వివిధ పార్టీల నాయకులు,విద్యార్థి సంఘాల నాయకులు,పోరాడి తలకొండపల్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలను సాధించుకున్నాము.అయితే సాధించుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు. ఎంపీసీ. బైపిసి. సీఈసీ. ఎం పి హెచ్ డబ్ల్యు. ఎం ఎల్ టి.లు ఉండగా ఏ ఒక్కరు చేరకపోవడంతో గత సంవత్సరం జూనియర్ కళాశాలలో ఏ ఒక్కరు చేరలేదన్నారు. ఈ సంవత్సరమైనా విద్యార్థులు పెద్ద ఎత్తున అడ్మిషన్స్ కావాలని కోరారు తలకొండపల్లి మండలానికి 32 గ్రామాలు ఉన్నాయని టెన్త్ చదివిన విద్యార్థులు, 372 మంది విద్యార్థులు ఉన్నారని వీరంతా తలకొండపల్లి ప్రభుత్వం కళాశాలలో చేరాలన్నారు.అనుభవజులైన ఉపాధ్యాయులు విద్య బోధనలు. ఉచిత విద్య ఉచిత పాఠశాల పుస్తకాలను పంపిణీ జరుగుతాయన్నారు.గ్రంథాలయం సౌకర్యం కలదు ప్రతి గదిలలో సీసీ కెమెరాలతో క్లాస్ రూమ్ లో నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది విద్యార్థులకు ఎలాంటి అపాయం కలవకుండా చూసుకుంటామని తెలిపారు. ప్రైవేట్ కాలేజీలలో చేరి తల్లిదండ్రులను ఇబ్బందులు గురి చేయకూడదని తెలిపారు.తలకొండపల్లి ప్రభుత్వం కళాశాలలో చేరాలని మన కాలేజీ మనమే కాపాడుకోవాలని తల్లిదండ్రులను వివిధ పార్టీల నాయకులను,విద్యార్థి సంఘాల నాయకులను,విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట చారి, శ్రీశైలం గోవర్ధన్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ,ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం..

### ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందలన్నదే కాంగ్రెస్ లక్ష్యం..
### పేదల పెళ్లికి అండగా కాంగ్రెస్.
### రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు.



కేశంపేట ప్రతినిధి (నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్ర ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన పేదలకు గృహ వసతి కల్పించాలనే ఉద్దేశంతో పైలెట్ ప్రాజెక్టు కింద షాద్ నగర్ నియోజకవర్గంలో 3500 గృహాలను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు అందులో భాగంగా కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేట గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదలకు 37 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని త్వరలోనే పేదింటి ప్రజల కళ నెరవేరబోతుందన్నారు ప్రతి పేదవాడు కూడా సన్న బియ్యంతో మూడు పూటలా భోజనం చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పేదలకు అందిస్తుందని ఇండ్లు లేని అర్హులైన నీరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించేందుకు ప్రభుత్వం ఒక మహత్తరమైన కార్యక్రమాన్ని తీసుకుందని షాద్ నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామంలో ఇండ్లు లేని అర్హులైన పేద ప్రజలకు ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు గత పదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రోడ్ల మీదకు వచ్చి నిరసనలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించిందని అదేవిధంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా ప్రభుత్వం సుమారు నాలుగు లక్షలకు పైగా సబ్సిడీ లోనూ అందిస్తున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు పేదింటి పెళ్లికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మందికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు ప్రతిపక్షాలు పదేళ్లలో చేయని అభివృద్ధి అధికారంలోకి వచ్చిన నాటినుండి నేటి వరకు అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా తము పని చేస్తున్నామన్నారు..

## మంథని మండల కెమిస్ట్- డ్రగ్గిస్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక





మంథని, మే-15 (నేటిశుభోదయ దినపత్రిక): మంథని మండల క్రిమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కు గురువారం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా క్యాతం కుమార్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగేఉపాధ్యక్షులు గా నూక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చింతపండు రాజు,కోశాధికారి గా కనుకుంట్ల పురుషోత్తం, అడిషనల్ సెక్రటరీగా ఆరె కుమార్,ఆర్గనైజింగ్ సెక్రటరీ అరకాల కోటేశ్వర్,సలహాదారుగా మోత్కూరి శ్రీనివాస్ ను ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలు జిల్లా క్రిమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మామిడి వినోద్ కుమార్. ప్రధాన కార్యదర్శి రాజేందర్. కోశాధికారి పి .సతీష్ ల ఆధ్వర్యంలో జరిగాయి.ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన మందులను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదని.. డూప్లికేట్ మందుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యాపార పరమైన సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే జిల్లా యూనియన్ వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతుందని వినోద్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్ మెడికల్ దుకాణాల యజమానులు జె ఎస్ రెడ్డి. ఇల్లందుల శ్రీ రాము ముత్తారం, రామగిరి కమాన్ పూర్ మండలాల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు,జిల్లా యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు..

## పాలిరెడ్డి వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఆకు పాటి వెంకటేష్



నేటి శుభోదయ (ఏపీ బ్యూరో చంద్ర) (కనిగిరి/సి ఎస్ పురం) : కనిగిరి నియోజకవర్గం సి.ఎస్ పురం మండలంలోని రెడ్డిగారి కొత్తపల్లి గ్రామానికి చెందిన పాలిరెడ్డి కృష్ణారెడ్డి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపిన ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు, పామూరు పట్టణ రెండవ ఎంపీటీసీ డాక్టర్ ఆకుపాటి వెంకటేష్. ఈ కార్యక్రమంలో పలువురు ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు

## హిందువుల మనోభావాలను దెబ్బతినే విధంగా వ్యవహరించారు

### టిపిసిసి ఎన్నికల కమిటీ సభ్యులు కాచే శశిభూషణ్



మంథని, మే-15 (నేటిశుభోదయ దినపత్రిక): సరస్వతీ నది పుష్కరాలు 2025 సందర్భంగా కాళేశ్వరం లో ఏర్పాటుచేసిన కటౌట్లలో ఏదేని పొరపాటు చోటు చేసుకున్నట్లయితే ఆ భాద్యత వాటిని ఏర్పాటు చేసిన ప్రచార సంస్థదే తప్ప ప్రభుత్వ పెద్దలది కాదు,దీనిని భూతద్దం లో చూపడం మంచిది కాదు,పొరపాటును సరిదిద్దమని ఆదేశించడం జరిగింది.ఈ అశంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారు హిందువుల మనోభావాలను దెబ్బతినేవిదంగా వ్యవహరించారు. ప్రభుత్వ యంత్రాంగం పోరపాటును సరిదిద్దు తుంది,ఈ పోరపాటుకు మేము కూడా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తోన్నాం అని టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యులు శశిభూషణ్ కాచె ఒక ప్రకటనలో తెలిపారు.

## విక్రమ్ రావు హఠాన్మరణం తీరని లోటు

### టిడబ్ల్యూజేఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోగుల విజయ్ కుమార్, సుంక మహేష్



(నేటి శుభోదయ) పెద్దపల్లి జిల్లా ప్రతినిధి- మే15: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐ ఎఫ్ డబ్ల్యూ జె) జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు హఠాన్మరణం విషాదకర సంఘటనతో జర్నలిస్టు సమాజానికి తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోగుల విజయ్ కుమార్ సుంక మహేష్ లు అన్నారు. గురువారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద గల అమరవీరుల స్తూపం వద్ద విక్రమ్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోగుల విజయ్ కుమార్, సుంక మహేష్ లు మాట్లాడుతూ తెలుగు వారైన విక్రమ్ రావు జర్నలిజం రంగంలో దేశవ్యాప్తంగా గొప్ప గుర్తింపు పొందారని,ఢిల్లీ, లక్నో వంటి నగరాల్లో పలు ప్రఖ్యాత పత్రికల్లో జర్నలిస్టుగా, ఎడిటర్గా సేవలందించారని అన్నారు. సుదీర్ఘకాలంగా లక్నోలో నివసిస్తూ జర్నలిస్టుల హక్కుల కోసం నాలుగు దశాబ్దాలకు పైగా పోరాడారని గుర్తు చేశారు. 1984 నుండి ఐఎఫ్డబ్ల్యూజేకు ఆరు సార్లు అధ్యక్షుడిగా ఎన్నికై, వృత్తి ధర్మం కోసం ఎంతో కృషి చేశారని, ఆయన దాదాపు 200కు పైగా పుస్తకాలు రచించారని అన్నారు.దేశంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలకు మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఫణి సుదర్శన్, సభ్యులు సబ్బు సతీష్, శ్రీనివాస్, షాబీర్ పాషా, కాల్వల భాస్కర్ ఇరుగురాల ప్రశాంత్, మేడి దేవేందర్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాండ్ల పట్టణ నూతన సంఘ భవనాన్ని ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే....

### ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 15 (నేటి శుభోదయ): ఇందూర్ నగరం సిర్నాపల్లి గడి గాండ్ల పట్టణ సంఘం రెండొవ అంతస్థు భవనాన్ని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ప్రారంభించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతు ఇందూర్ పట్టణ గాండ్ల సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేవిదంగా ఐక్యమత్యంతో అంచలంచలుగా ఎదగడం అభినందనీయం అన్నారు.గాండ్ల పట్టణ సంఘం రెండవ అంతస్తుకు ఎస్ డి ఎఫ్ నిధుల కింద 5 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి దాదాపు రెండు ఏండ్లు కావొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఎమ్మెల్యే నిధులు కూడా మంజూరు చేయలేదని అన్నారు.నియోజకవర్గం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి రావడానికి సిద్ధంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతుందని అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ అర్బన్ నియోజకవర్గంపై ప్రత్యేక చొరవ తీసుకొని స్పెషల్ ఫండ్ మంజురు చేయాలనీ విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో గాండ్ల పట్టణ సంఘం అధ్యక్షులు అశోక్, నాగరాజు, నూడా చైర్మన్ కేశవేణు, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

### నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 15 (నేటి శుభోదయ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మాకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్ల పథకం లో భాగంగా గురువారం రూరల్ నియోజకవర్గం నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో 40 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేయడం జరిగింది. తమ గ్రామంలో 40 మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ఎంత కృషిచేసిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే డా.ఆర్ భూపతిరెడ్డి కి మల్లారం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజామాబాదు జిల్లా కాంగ్రెస్ డీసీసీ డెలికేట్ మెంబెర్ జవాజీ రమేష్ , గ్రామ సెక్రటరీ శ్వేత,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పిట్ల నెహ్రు,మండల సెక్రటరీ కొండా శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గస్కంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన

### 27 మందికి జరిమానా, ఐదుగురికి జైలు శిక్షా.... ట్రాఫిక్ ఏసిపి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 15 (నేటి శుభోదయ): మద్యం తాగి వాహనాలు నడిపినటువంటి 32మందికి ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశానుసారం ఇన్స్పెక్టర్ పి.ప్రసాద్ తేదీ 15 న కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్ జాన్ ముందర హాజరుపరచగా 27 మందికి రూ 38500/- జరిమానా విధించి,ఐదు గురికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.**

# విశాఖలో మాయా లోకం

### రూ.460 కోట్లతో ఈస్ట్‌కోస్ట్ హెబిటేట్ సెంటర్

### 2.82 ఎకరాల్లో వర్చువల్ రియాల్టీ ఎరీనా, త్రీ స్టార్ హెూటల్

### పీపీపీ విధానంలో చేపట్టేందుకు కసరత్తు

### ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ దరఖాస్తుల ఆహ్వానం

### మధురవాడలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు



విశాఖ సిటీ: ఊహకందని అద్భుత ప్రపంచం కళ్ల ముందు సాక్షాత్కరించనుంది. కనివినీ ఎరుగని మాయాలోకం అందరినీ మంత్రముగ్ధులను చేయనుంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేనటువంటి మిథ్యా ప్రపంచం విశాఖ వాసులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. ఇందుకోసం విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. మధురవాడ ప్రాంతంలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వర్చువల్ వరల్డ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించడానికి 'వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాలిటీ ఎరీనా అండ్ త్రీ స్టార్ హెూటల్'తో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలతో ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్ ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తులు ఆహ్వానించింది.

**రూ.470 కోట్లతో హేబిటేట్ సెంటర్**

ఆధునిక వాతావరణంలో సంపన్న వర్గాల అభిరుచులకు తగ్గట్టుగా 'ఈస్ట్ కోస్ట్ హేబిటేట్ సెంటర్'ను నిర్మించాలని వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. ఐటీ సంస్థలకు సమీపంలో ఎండాడ లా కాలేజీ నుంచి రుషికొండ రోడ్డులో 8.82 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. పీపీపీ విధానంలో రూ.470 కోట్లతో ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో ఐటీ స్పేస్, బిజినెస్ సెంటర్, రిటైల్ స్పేస్, ఆడిటోరియం, సెమినార్ హాల్, పార్టీ ఈవెంట్స్ లాన్‌లతో పాటు ట్రేడ్ ఫెయిర్లు, ఆర్ట్, కల్చర్ షో, ఎగ్జిబిషన్లకు అనువుగా సౌకర్యాలు కల్పించనున్నారు. అలాగే క్లబ్ హౌస్, అంతర్జాతీయ రుచులతో వంటలు అందించే రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తారు. అలాగే ఇండోర్ యాంఫీ థియేటర్, 400 మంది పట్టేలా కేఫ్‌టేరియా, 600 మంది సౌకర్యంగా కూర్చునే ఫైన్ డైన్ రెస్టారెంట్లు ఉండనున్నాయి. 60 రూములు కలిగిన హెూటల్, 250 మందికి సరిపడా ఈవెంట్ లాన్, సూపర్ మార్కెట్, మెడికల్, స్పోర్ట్స్ సెంటర్లు కూడా రానున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీలోగా ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న సంస్థల అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోనున్నారు.వీలైనంత వేగంగా ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలని అధికారులు భావిస్తున్నారు.

**2.82 ఎకరాల్లో వర్చువల్ ఎరీనా**

విశాఖ వాసులకే కాకుండా ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా విశాఖలో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని అందించేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు సరికొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటి వరకు పార్కులు, మ్యూజియాలు, కన్వెన్షన్ సెంటర్లపైనే దృష్టి పెట్టినవారు.. ఇప్పుడు భవిష్యత్తు తరాలకు ఆసక్తికరమైన, ఆకట్టుకునేలా వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాల్టీ ఎరీనా అండ్ 3 స్టార్ హెూటల్ నిర్మాణానికి సిద్ధమవుతున్నారు. ఎండాడ లా కాలేజ్ మార్గంలో 2.82 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. గేమింగ్, వర్చువల్ రియాలిటీ, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ వంటి సాంకేతికత అంశాలతో తీర్చిదిద్దనున్నారు. ఇందులో వర్చువల్ రియాలిటీ అనుభవాన్ని పొందేలా 360 డిగ్రీల థియేటర్, మిక్స్‌డ్ రియాల్టీ ఎస్కేప్ రూమ్, చారిత్రక యుగాల అనుభవంలోకి తీసుకెళ్లేలా వర్చువల్ టైమ్ ట్రావెల్, వీఆర్ గేమింగ్ జోన్, 350 చదరపు మీటర్ల భారీ అక్వేరియం, 20 మల్టీక్యూజన్ రెస్టారెంట్ అవుట్‌లెట్లు, 10 శాతం కమర్షియల్ అవుట్‌లెట్లతో పాటు 100 రూమ్‌లు, 1000 మంది పట్టేలా ఫంక్షన్ హాల్‌తో త్రీ స్టార్ హెూటల్‌ను నిర్మించనున్నారు.

**ఆర్థిక, పర్యాటకానికి అనుగుణంగా..**

పర్యాటకాభివృద్ధి కోసమే కాకుండా ఆర్థిక పరిపుష్టికి అనుగుణంగా రెండు కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నాం. ఐటీ సంస్థలకు సమీపంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలతో వర్చువల్ రియాలిటీ ఎరీనాతో పాటు అర్బన్ హేబిటేట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఇందుకోసం ఆర్ఎఫ్‌పీలు ఆహ్వానించాం. ఇవి ఏర్పాటైతే ప్రపంచ పర్యాటకులకు మంచి అనుభూతిని పంచడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణకు వేదికలుగా నిలుస్తాయి.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు

### పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి....

### అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: చిలుక విజయకుమార్: మే 15 (నేటి శుభోదయ): 2024-25 విద్య సంవత్సరం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్లో సంబంధిత వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తో అదనపు కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ మే నెల 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు,రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు.ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం18,837 మంది విద్యార్థులు హాజరు కానుండగా,36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు.పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్ రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారికి సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాలకు చేరే విధంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ కు సూచించారు.పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయినుంచిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తెలియజేశారు.పరీక్షలు పూర్తైన తర్వాత జవాబు పాత్రల బండల్లను పోస్టల్ శాఖ వారు తమ ఆధీనంలో కి తీసుకుని ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్ణీత ప్రాంతాలకు జాగ్రత్తగా చేర్చాలని పోస్టల్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.పరీక్షలు సజావుగా కొనసాగేలా అందరు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు.పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని,144 సెక్షన్ అమలు చేయాలని,తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి,మూత్రశాలలు,మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని,పరిశు భ్రమైన వాతావరణం నెలకొనెలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమిస్తూ,ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఇంటర్ విద్య అధికారి తిరుమల పూడి రవికుమార్ మాట్లాడుతూ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్,రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమిస్తున్నమని అన్నారు.మొత్తం 36 పరీక్ష కేంద్రాల్లో సీ.సీ. కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. వేసవి దృశ్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా మంచినీటి వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రథమ చికిత్స నిర్వహణ కోసం ఏర్పాట్లు,కట్టుదిట్టమైనపర్యవేక్షణచేస్తామన్నారు.ప్రశాంత వాతావరణం లో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి,ట్రాన్స్ కో, పోస్టల్,రెవెన్యూ వివిధ శాఖల అధికారులు,అడిషనల్ పోలీసు కమిషనర్ బస్వారెడ్డి,ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య,కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

# టార్గెట్లూ- టార్చర్లూ!



తెలుగు రాష్ట్రాల్లో కోడి పందాల సమయంలో అనేక వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. వాటిని నిర్వహిం చొద్దంటూ హైకోర్టు నుంచి ఆదేశాలు, పోలీసుల నుంచి హెచ్చరికలు వస్తుంటాయి. కానీ వాటిల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోవు. యదేచ్ఛగా పందాలు కొనసాగుతాయి. మరుసటిరోజే టీవీల్లో, పేపర్లలో వార్తలొస్తాయి. కానీ వాటిపై ఎవరూ చర్యలు తీసుకోరు. ఇప్పుడు ఇదేవిధంగా ఉన్నాయి ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల తీరూతెన్నులు. వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహించొద్దు, పిల్లలను ఒత్తిడికి గురిచేయొద్దంటూ ప్రభుత్వం, విద్యాశాఖ పదేపదే హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. ఈ సంవత్సరం కూడా ఆ పరంపర కొనసాగింది. కానీ హైదరాబాద్ సహా జిల్లాలు, మండల కేంద్రాల్లోని అనేక ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలు సర్కారు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. వార్షిక పరీక్షలు ముగిసిన ఏప్రిల్‌లోనే మళ్లీ పైతరగతుల క్లాసులను ప్రారంభించాయి. ప్రారంభించటమే గాదు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశా లలకు ఫోన్లు చేసి, అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలంటూ లెక్చరర్లను, సిబ్బందిని అవి ఆదేశించటం గమనార్హం. ఈ రకంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయా కాలేజీలు.. మరోవైపు తమ వద్ద పనిచేసే అధ్యాపకులు, సిబ్బంది మెడపై మరోకత్తిని వేలాదీయటం కలవరపాటుకు గురిచేస్తోంది. 'మీ ఉద్యోగాలు ఉండాలంటే కచ్చితంగా మేం చెప్పిన పనులు చేయాల్సిందే. ఒక్కొక్కరు ఇంటింటికీ తిరిగి పిల్లలను పట్టుకుని రావాలి, అడ్మిషన్లు చేయించాలి, ఫీజులు వసూలు చేసే బాధ్యతను సైతం మీరే తీసుకోవాలి. అలాగని ఒకరో ఇద్దరో పిల్లల్ని తీసుకొస్తే సరిపోదు, కనీసంలో కనీసంగా ఓ పదిహేను మందిని కాలేజీల్లో చేర్పించాలి, లేదంటే మీదారి మీరు చూసుకోవాల్సి ఉంటుంది' అంటూ హుకూం జారీ చేయటం పరిపాటిగా మారింది. దీంతో ఏం చేయాలో పాలు పోక ప్రయివేటు అధ్యాపకులు, సిబ్బంది తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. ఇది ఒకరకమైన వేధింపులైతే.. నాణేనికి రెండోవైపు ఇంకోరకమైన సాధింపులు కొనసాగుతుండటం అధ్యాపకులను మరింత ఒత్తిడిలోకి నెడుతోంది. ఇటీవల విడుదలైన ఇంటర్, ఎమ్‌సెట్, జేఈఈ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల ఘనతను తమ ఖాతాల్లో వేసుకుంటున్న యాజమాన్యాలు.. ఫెయిలైన విద్యార్థులు, మార్కులు, ర్యాంకుల్లో వెనుకబాటును మాత్రం లెక్చరర్ల వైఫల్యాలుగా చిత్రీకరిస్తూ వారిని ఆత్మనూన్య తాభావానికి గురి చేస్తుండటం విస్మయకరమైన అంశం. ఆ వైఫల్యాలకు వారిని బాధ్యులను చేస్తూ ఒక బ్రాంచి నుంచి మరోదానికి మారుస్తూ వారి జీవితాలతో ఆటాడుకుంటున్న దృష్టాంతాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. ఇవన్నీ ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగంపై ప్రభుత్వ అజమాయిషీ కొరవడిన వైనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. నియమ నిబంధనలకు విరుద్ధంగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ఆయా విద్యాసంస్థలు తమకున్న పలుకుబడిని ఉపయోగించి, ఇష్టానుసారంగా రాజ్యాన్నేలు తున్నాయి. వేలమందికి అడ్మిషన్లు ఇస్తున్న పలు కార్పొరేట్ కాలేజీలు..కొన్ని వందల మందికి మాత్రమే మార్కులు, ర్యాంకులు తెప్పిస్తున్నాయనే విషయాన్ని మనం మరువరాదు. ఆ మార్కులు, ర్యాంకులనే పెద్దపెద్ద హెూర్డింగుల ద్వారా ప్రచారార్భాటం చేసుకుంటూ వందల కోట్లను ఆయా సం స్థలు పోగేసుకుంటున్నాయి. మిగతా ఫెయిలైన విద్యార్థుల సంఖ్యను, ఆ సంగతిని ఏమాత్రం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూ తమ వైఫల్యాలను మరుగుపరుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవటం వారి నిష్క్రియాపరత్వం, నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామంటూ చెబుతూనే.. మరోవైపు కార్పొరేట్ కాలేజీలకు ఎర్ర తివాచీలు పరవటం వారికే చెల్లింది. మన రాష్ట్రంలో సాక్షాత్తూ ముఖ్యమంత్రే, విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. మొన్నటి పది, ఇంటర్, ఎప్‌సెట్ ఫలితాల్లో ప్రభుత్వ బడులు, కళాశాలలు, గురుకులాలు%ా% ప్రయివేటు, కార్పొరేట్‌కు ధీటుగా తమ సత్తా చాటాయి. ఈ నేపథ్యంలో వాటిని మరింత బలోపేతం చేయటం ద్వారా కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి విద్యారంగాన్ని కాపాడాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకుల మెడపై కత్తి పెట్టి, బోధనేతర పనులను అప్పగిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. అప్పుడే నాణ్యమైన విద్యాబోధన సాధ్యం.

## వక్ఫ్ చట్టం పిటిషన్లపై మే 20న సుప్రీం విచారణ..



**న్యూఢిల్లీ,:**1995 చట్టంలోని ఏవైనా నిబంధనలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన ఏ పిటిషన్‌ని కూడా స్వీకరించబోమని, వక్ఫ్ సవరణ చట్టం-2025 అమలును తాత్కాలికంగా నిలుపుదల కోరుతూ నమోదైన పిటిషన్లను పరిగణలోకి తీసుకునే అంశంపై మే 20న నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవై నేతృత్వంలోని డివిజన్ బెంచ్, చట్టంలోని మూడు వివాదాస్పద అంశాలపై మధ్యంతర ఉత్తర్వు అవసరమా..? కాదా..? అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో ముస్లిమేతరులను నామినేట్ చేయడం, వక్ఫ్ కింద ప్రభుత్వ భూముల్ని గుర్తించడం వంటి వాటిపై పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, వీటిని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు సుప్రీంకోర్టుని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని సవాల్ చేస్తున్న పిటిషన్ల తరుపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తున్నారు. కేంద్రం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తున్నారు. సోమవారం ఉదయం నాటికి తన రాతపూర్వక నోట్‌ని సమర్పించాలని తుషార్ మెహతాని సుప్రీం ధర్మాసనం కోరింది. కోర్టు తీర్పు ఇచ్చే వరకు కొత్త చట్టం ప్రకారం కేంద్రం ఏ వక్ఫ్‌ను డీ-నోటిఫై చేయడానికి, వక్ఫ్ బై యూజర్, ముస్లిమేతరులను వక్ఫ్ కౌన్సిల్‌లో చేర్చడంవంటి వాటిపై చర్యలు తీసుకోదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి హామీ ఇచ్చారు.

## హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్..
## భారీ వర్షాలు భీకర గాలులు..
## ఆ సమయంలో బయటకు రావద్దంటూ సూచన



**హైదరాబాద్, :** హైదరాబాద్ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కొన్ని రోజులుగా ఎండలు, కొద్దిగా వానలతో సాగిన వాతావరణం ఇప్పుడు పూర్తిగా మేఘాలతో నిండి కనిపిస్తోంది. ఈ రోజంతా మేఘాలతోనే ఉంది. ఉదయం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉదయం 10 గంటల వరకు కురిసాయి. ప్రధానంగా జూబ్లిహిల్స్, బంజారాహిల్స్, కూకట్ పల్లి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. వర్షానికి తోడు, విపరీతమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ ఈదురుగాలుల వల్ల కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోతున్నాయి. రోడ్లపై ఎక్కడిక్కడ చెత్త చెల్లాచెదురుగా ఎగురుతోంది. కొన్నిచోట్ల రేకులు, ప్లాస్టిక్ వస్తువులు, డబ్బాలు, డ్రములు లాంటివి ఎగిరిపడుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే ఈ ఈదురుగాలులతో జాగ్రత్తగా ఉండాలని ఐఎండీ తెలిపింది. ఈ గాలులు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయి. గాలిసుడి..70 కిలోమీటర్ల వేగంతో ఉంది. నేడు రోజంతా హైదరాబాద్ పై మేఘాలు దట్టంగా పర్చుకుని ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎండ కనిపించడం లేదు. ఇంతలా వాతావరణం మార్పిపోవడానికి కారణం ఆగ్నేయ ఆసియా నుంచి వచ్చిన మేఘాలు..ఇండియాపైకి వచ్చాయి. బలమైన గాలులు కూడా మేఘాలు వచ్చేందుకు కారణమయ్యాయి. సాయంత్రం 6 తర్వాత హైదరాబాద్ అంతటా ఓ మోస్తరు వర్షం కొనసాగుతోంది. అది రాత్రి 10గంటల వరకు ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు గాలిని ద్రుష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఉండాలని బలమైన గాలులు వీస్తాయని ఐఎండీ చెబుతోంది. రాత్రి 10 తర్వాత హైదరాబాద్ లో భారీ వర్షం షురూ అవుతుంది. రాత్రి 12గంటలకు వర్షం మరింత ఎక్కువగా అవుతుంది. ఆ సమయంలో ప్రజలు రోడ్లపై పెద్దగా తిరగరు..కాబట్టి ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండదు. కానీ భారీ వర్షాల రోడ్లపై నీరు ప్రవహించే ఛాన్స్ ఉంటుంది. ఈ వర్షం 16వ తేదీ తెల్లవారుజామున4 గంటల వరకు కురుస్తుంది. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ చెబుతోంది.

## నష్టాన్ని పూడ్చాల్సిందే, లేదంటే సీఎస్ జైలుకే
## కంచ గచ్చిబౌలిపై సుప్రీం..!!



**హైదరాబాద్, :** సంచలనంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్? జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. సీఎస్? తో పాటు కార్యదర్శులూ జైలుకు పోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. లాంగ్? వీక్? ఎండ్? చూసి ఎందుకు చర్యలు చేపట్టారని అధికారులను అడిగింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించిన ధర్మాసనం హెచ్చరించింది. కాగా సీఈసీ దాఖలు చేసిన అఫిడవిట్‌పై కౌంటర్ వేసేందుకు కొంత సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. దీంతో జులై 23వ తేదీలోపు గతంలో ఉన్నట్లుగా అక్కడ పర్యావరణాన్ని పునరుద్ధరించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంటూ తదుపరి విచారణ జులై 23 వ తేదీకి వాయిదా వేసింది. అలాగే విద్యార్థులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన ఐఏను సుప్రీంకోర్టు త్రోసి పుచ్చింది. ఆ విషయంలో ప్రత్యేకంగా మరో పిటీషన్‌ను దాఖలు చేయాలని, ఈ కేసులో కలపకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. గత విచారణ సందర్భంగా పర్యావరణ వన్యప్రాణుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెబుతూ.. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు యధాస్థితి కొనసాగించాలని పేర్కొంది. ఈలోగా ఒక్క చెట్టు కూడా నరకడానికి ఒప్పుకోమని స్పష్టం చేసింది. విచారణ ప్రారంభంలోనే వివరాలను పరిశీలించిన సీజేఐ తెలంగాణ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇష్టానుసారంగా డజన్ల కొద్దీ బుల్డోజర్లతో చెట్లు తొలగించేందుకు వినియోగించారని, ఇదంతా ముందస్తు పథకం ప్రకారమే చేసినట్టుగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా.. లేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలని జస్టిస్ గవాయ్ అన్నారు.

## యాదాద్రికి పోటెత్తుతున్న భక్తులు.. తగిన సౌకర్యాలు లేక తిప్పలు

**హైదరాబాద్,:**యాదాద్రి భువనగిరి: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన యాదగిరిగుట్ట కొండకు వచ్చే భక్తులకు సరైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల యాదాద్రి దర్శనానికి వచ్చే భక్తులకు కొరవడిన రవాణా సౌకర్యంతో పాటు, భద్రతా సిబ్బంది వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి సెలవులు కావడంతో దైవ దర్శనం కోసం భక్తులు యాదాద్రికి పోటెత్తుతున్నారు. దర్శన సమయంలో భక్తులు కిటకిటలాడుతున్నారు. ఈ సమయంలో భక్తుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. దీనికి తోడు భక్తుల రద్దీకి తగ్గట్లు రవాణ సౌకర్యం లేదని, దైవదర్శనంలో భక్తులు వాగ్వాదినికి దిగుతున్నా పోలీసు సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీనికి తోడు భక్తుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపడంలో అధికారుల విఫలమవుతున్నట్లు సమాచారం.బస్సు సౌకర్యం లేకపోవడం, ఆటోవాలా దోపిడీ ఎక్కువైందని, తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ‘శాంతిదూత’ ట్రంప్!



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంత సులభంగా అర్థం కారని ఆయన గల్ఫ్ దేశాల పర్యటన తీరుతెన్నులు చూస్తే తెలుస్తుంది. తాను అధికారంలోకొస్తే పశ్చిమాసియాలో సాగుతున్న ‘అంతూ దరీ లేని యుద్ధాలకు’ ముగింపు పలుకుతానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన తరచు అనే వారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రోజుల గల్ఫ్ పర్యటనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తే ఆ వాగ్దానాన్ని ఆయన నెరవేర్చదల్చుకున్నట్టు కనబడుతోంది. తన రెండో దశ పాలనలో ట్రంప్ మొదలెట్టిన తొలి విస్తృత విదేశీ పర్యటన ఇది. ఈ ప్రాంతంలోనే ఉన్న ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లకపోవటం ఆయన తాజా వైఖరికి సంకేతం. ఇది ఎన్నాళ్లుంటుందన్నది తెలియక పోయినా చేస్తున్న ప్రకటనలైతే భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌తో అమెరికా 46 ఏళ్ళుగా సాగిస్తున్న ‘అప్రకటిత యుద్ధం’ ఇక కొనసాగనీయరాదన్న అభిప్రాయం ఉందని మంగళవారం సౌదీ అరే బియాలోని రియాద్‌లో ఆయన ప్రకటించారు. బుధవారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షారాతో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనాలని సలహా ఇచ్చారు. అల్-షారాకు గతంలో అల్ కాయిదాతో, ఐఎస్‌తో సంబంధాలుండేవి. ఈ భేటీకి ముందే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) సదస్సులో సిరియాపై ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు తెలియజేశారు. ఈ నిర్ణయాలపై ఇజ్రాయెల్ అలిగినా, మరొకరు అభ్యంతర పెట్టినా ఆయన ఖాతరు చేయదల్చుకున్నట్టు లేరు. గత నెలలో ట్రంప్‌ను కలిసి సిరియాపై ఆంక్షలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వేడుకున్నారు. ఇరాన్ విషయంలో అయితే చాలా చెప్పివుంటారు. సిరియాపై ఆంక్షలు ఎత్తేయటం, ఇరాన్‌తో చెలిమికి సిద్ధపడటం నెతన్యాహూకు ససేమిరా ఇష్టం లేదు. కానీ లీకుల ద్వారా తప్ప నేరుగా తన అసమ్మతిని ఇంతవరకూ తెలియజేయలేదు. ఆ మధ్య ట్రంప్ ఇందుకు భిన్నంగా మాట్లాడారు. అణు ఒప్పందాన్ని అంగీకరించి, శాంతికి సిద్ధపడకపోతే ఇరాన్ భారీ స్థాయి ఒత్తిడులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కానీ ట్రంప్ తాజా ధోరణి అందుకు భిన్నంగా ఉంది. ఇరాన్‌తో చెలిమి గురించి ఆయన ఏదో మాటవరసకు అనలేదు. ‘ప్రస్తుతం అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలు కొన్ని తరాల కిందట మాపై శత్రుత్వంతో చెలరేగినవే’ అని గుర్తుచేశారు. సిరియా, ఇరాన్‌ల విషయంలో తన వైఖరి మారటానికి సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ కారణమని ఆయన జీసీసీ వేదికపైనే ప్రకటించారు కూడా. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నా ఈనెల 5న వారితో అవగాహనకొచ్చారు. స్నేహంలోనైనా, శత్రుత్వంలోనైనా ట్రంప్ తీరే వేరని ఆయన నిర్ణయాలు తెలియజేస్తున్నాయి. మూడేళ్లనాడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సౌదీ వచ్చినప్పుడు దేశంలో మానవహక్కులు అడుగంటుతున్న వైనంపై సౌదీ యువరాజును నేరుగా ప్రశ్నించారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి ప్రాణం తీయించడాన్ని ప్రస్తావించారు. ఈ మాదిరి హత్యలు తమకు సమ్మతంకావని చెప్పారు. అందుకే కావొచ్చు... ఇప్పుడు ట్రంప్‌కు ఎదురైన స్వాగతసత్కారాల వంటివి బైడెన్‌కు లభించలేదు. సౌదీ గడ్డపై గతకాలపు అమెరికా అధ్యక్షుల్ని నిశితంగా విమర్శించటానికి ట్రంప్ వెన కాడలేదు. అమెరికన్ సమాజం గురించి కాస్తయినా తెలియనివారు ఎంతో జటిలమైన గల్ఫ్ సమా జాల్లో జోక్యం చేసుకోవటానికి ఎగబడ్డారని వ్యాఖ్యానించటం చిన్న విషయం కాదు. పశ్చిమాసియా దేశాలతో ఎన్ని వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకోగలమన్నదే ఆయన ఆరాటంగా కనబడు తోంది. దానికి తగ్గట్టే మంగళవారం సౌదీతో 14,200 కోట్ల డాలర్ల మేర ఆయుధ ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఇదిగాక అమెరికాలో 60,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు యువరాజు ప్రకటించారు. ట్రంప్ దీంతో సంతృప్తిపడలేదు. దీన్ని లక్ష కోట్ల డాలర్లకు పెంచాలని ఆ వేదికపైనుంచే కోరారు. సౌదీతో అమెరికాకు ఎప్పుడూ మంచి స్నేహసంబంధాలేవున్నా ఈ స్థాయి ఒప్పందాలెప్పుడూ లేవు. ఒక పరిశోధక సంస్థ నివేదిక ప్రకారం 2010-20 మధ్య అమెరికాకు సౌదీతో 10,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు మాత్రమే కుదిరాయి. స్నేహం పేరుతో అమెరికాను దోచుకుంటున్నారని నాటో భాగస్వామ్య దేశాలైన పాశ్చాత్య మిత్రులపై తరచూ విరుచుకుపడే ట్రంప్...పశ్చిమాసియా దేశాలకు ఏ కష్టమొచ్చినా అమెరికా దృఢంగా నిలబడుతుందని హామీ ఇవ్వటం గమనార్హం. ఇంధన అవసరాల్లోనూ, రక్షణరంగంలోనూ పనికొచ్చే అత్యంత విలువైన లిథియం, కోబాల్ట్‌లతోపాటు థోరియం వంటి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అన్వేషించి అమెరికా చేర్చటానికి సౌదీ%-%అమెరికా ఖనిజ సంస్థల మధ్య ఈ పర్యటనలో 900 కోట్ల డాలర్ల ఒప్పందం కుదరటంతో ట్రంప్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. అందువల్లే పశ్చిమాసియాకు శక్తి మంతమైన సెమీ కండక్టర్ చిప్స్, ఏఐ డేటా సెంటర్లకు పనికొచ్చే కీలక విడిభాగాల ఎగుమతులకు ఆయన పచ్చజెండా ఊపారు. ఇది సంప్రదాయ అమెరికా విదేశాంగ విధానానికి భిన్నం. ఈ పర్యటనలో ట్రంప్ స్వకార్యమూ నెరవేర్చుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దేశ ప్రయోజనాలకూ, అధ్యక్షుడిగా ఆయన నిర్ణయాలకూ చుక్కెదురన్నది విమర్శకుల వాదన. ట్రంప్ సొంత సంస్థకు సారథ్యం వహిస్తున్న ఆయన కుమారులు గత కొన్నివారాలుగా గల్ఫ్‌లో తిష్ఠ వేసి తమ సంస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనీ, కుదిరిన ఒప్పందాలన్నీ వారికి మేలు కలిగించేవేననీ అంటున్నారు. ఏది ఏమైనా ట్రంప్ వైఖరి మళ్లీ మారేలోగా పశ్చిమాసియా చక్కబడితే ప్రపంచానికి అంతకన్నా కావాల్సిందేమీ లేదు.

# కాల్పుల విరమణ వ్యూహమా? ఒత్తిడినా?




పహల్గాం ఉగ్రదాడి భారతదేశ ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది. అమాయకులైన పర్యాటకులను మతం పేరు అడిగి మరీ చంపిన విధానాన్ని దేశం జీర్ణించుకోలేకపోయింది. దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఆవేదనలు వెల్లువెత్తాయి. ఈ దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ ఉగ్రవాద స్థావరాలపై సంచలనాత్మక ప్రతీకార చర్యగా నిలిచింది. శత్రు శిబిరాల్లోని వందకు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడం ద్వారా భారత సైన్యం తమ నిపుణతను, ధైర్యాన్ని మరోసారి నిరూపించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే క్రమంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలు ఒక్కటైన తీరు, రాజకీయాలను వీడి ఏకమైన నాయకుల ప్రవర్తన, ప్రతి భారతీయుడి గుండె చప్పుడులో ఉగ్రవాదాన్ని అణచివేయాలనే ఆకాంక్ష, అన్ని కలిసి దేశంలో జాతీయ చైతన్యాన్ని రగిలించాయి. కానీ, పరిస్థితి ఇక్కడితో ఆగలేదు. సరిహద్దుల్లో పాకిస్తాన్ కాల్పులకు తెరలేపింది. పాకిస్తాన్ ప్రతీ ఒక్క దాడికి భారత సైన్యం అనూహ్య ధైర్యంతో, సమర్థవంతంగా బదులిచ్చింది. ఈ పరిణామాల వల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉధృత స్థాయికి చేరాయి. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే, రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం తప్పదేమోననే భావన అంతర్జాతీయంగా ఆందోళన వెల్లువెత్తాయి. ప్రపంచంలోని దేశాలన్నీ భారత్ -పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ఎంతవరకు వెళతాయేమోనని ఆందోళన చెందాయి. ఇటువంటి ఉద్విగ్న వాతావరణంలో ‘కాల్పుల విరమణ’ అనే ప్రకటన ఒక్కసారిగా వినిపించడం దేశప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది భారత్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి స్పందనగా వచ్చిన ఫలితమా? అనే సందేహాలు, అనుమానాలు దేశ మొత్తం విస్తరించాయి. దేశ ప్రజలలో నెలకొన్న ఈ సందేహాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ మరింత బలపరిచింది. ఆయన ట్వీట్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందన్న ఊహాగానాలకు ఊపునిచ్చింది. అమెరికా అధినేత ఈ పరిణామాల్లో భాగం కావడం అనుమానాలకు తావిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో 2025 మే 12న, భారత్ పాకిస్తాన్ మధ్య డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) స్థాయిలో హాట్‌లైన్ ద్వారా కీలక చర్చలు జరిగాయి. ఈ చర్చలలో ప్రధానంగా చర్చించబడిన అంశాలు, పూర్తి కాల్పుల విరమణ: లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద రెండు దేశాలు కాల్పులు జరగకుండా పరస్పర అంగీకారానికి వచ్చాయి. సైనికుల తగ్గింపు: సరిహద్దు, ముందస్తు ప్రాంతాలలో సైనికుల సంఖ్యను తగ్గించే చర్యలను వెంటనే అంగీకరించారు. శాంతి, స్థిరత్వం: పరస్పర శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు, ఎటువంటి శత్రుత్వ చర్యలు లేకుండా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ చర్చలు, 2025 మే 10న ప్రారంభమైన కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు, సరిహద్దు ప్రాంతాలలో శాంతిని పునరుద్ధరించేందుకు కీలకంగా ఉన్నాయి. అయితే, ఈ డిజిఎంఒల చర్చల తర్వాత కొన్ని గంటల్లోనే, లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద కాల్పులు జరిగాయనే వార్తలు కొన్ని వచ్చాయి. భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘించిందని ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను పాకిస్తాన్ ఖండించింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉంది, రెండు దేశాలుపరస్పరం శాంతిని కాపాడేందుకు చర్చలు కొనసాగిస్తున్నాయి. ఈ చర్చలు మొదటి దశ మాత్రమే. భారత్- పాకిస్తాన్ మధ్య జరిగిన చర్చలు, రెండు దేశాల మధ్య మారుతున్న దృక్పథానికి సంకేతంగా భావించవచ్చు. ఈ చర్చలు ఒక సానుకూల సంకేతంగా కనిపిస్తున్నా వీటి వెనక దాగిన మౌలిక ఉద్దేశం ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. యుద్ధ వాతావరణం నుండి చర్చల దశకు జరిగిన ఈ మార్పు ఒక ఊరట నిచ్చే అంశమే. అయితే, ఈ మార్పు తాత్కాలిక శాంతికి సంకేతమా? లేక దీర్ఘకాలిక సుస్థిరతకు మార్గనిర్దేశమా? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడే మన భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2025 మే 12న జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై తీవ్రంగా స్పందించారు. ఆ దాడిలో అమాయక ప్రజల ప్రాణాలు పోవడం దేశాన్ని కలిచివేసిందని పేర్కొన్నారు. దానికి ప్రతిగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ విజయవంతమైందని, భారతదేశ సైనికుల వీరత్వానికి నిదర్శనమని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా దేశ భద్రతకు భంగం కలిగించే శక్తులపై భారత్ తగిన తీరులో స్పందిస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాకిస్తాన్ కఠిన పరిణామాలకు సిద్ధంగా ఉండాలని మోడీ స్పష్టంగా హెచ్చరించారు. శాంతి కోసం మన ప్రయత్నం కొనసాగుతుంది, కానీ దేశ భద్రతకు భంగం కలిగించే ఎవ్వరినీ విడిచిపెట్టం అనే ప్రధాని మోడీ సందేశం ఒక వైపు శాంతికి మద్దతు ఇస్తూనే, మరోవైపు దేశరక్షణ విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గబోమనే సంకేతాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. శాంతికి మద్దతు, భద్రత విషయంలో రాజీ లేదు అనే ప్రధాని సందేశం మలిదశ చర్చలకు గట్టి పునాది వేసిందని చెప్పవచ్చు. ఈ మొత్తం పరిణామాలను సమగ్రంగా విశ్లేషిస్తే, కాల్పుల విరమణ వెనక వ్యూహాత్మక స్పష్టత ఉందా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి లోబడి తీసుకున్న తాత్కాలిక నిర్ణయమా? అనే సందేహం ప్రజల మనసుల్లో ఇంకా మిగిలే ఉంది. శాంతి అత్యవసరం అయినా, అది స్థిరంగా నిలవాలంటే స్పష్టమైన దిశానిర్దేశం, బలమైన కార్యాచరణ అవసరం. శాంతి పేరుతో మౌనంగా తలవంచడం భవిష్యత్‌కి ప్రమాదకరంగా మారవచ్చు. శాశ్వత శాంతికి ధైర్యవంతమైన నిర్ణయాలు, ప్రజల రక్షణను కేంద్రీకరించిన వ్యూహం అవసరం. ప్రపంచ ఒత్తిడుల కంటే దేశ భద్రతే ప్రథమ లక్ష్యం కావాలి. యుద్ధం ఉపశమనం ఇవ్వదు, కానీ శాంతి నిలబడాలంటే దానిని భంగం చేసే శక్తులకు భయం కలిగించే సామర్థ్యం మనకు ఉండాలి. బలహీన దేశాల శాంతి ఎప్పుడూ దాడుల అంచులపై నడిచిందని, శాంతి కోసం మూల్యం చెల్లించాల్సి వచ్చిందని చరిత్ర చెబుతుంది. అందుకే, శాంతిని మాటలతో కాదు, శక్తితో రక్షించాలి. శత్రువు మనపై దాడికి ముందు పది మేరలు ఆలోచించాలంటే, మన దగ్గర అగ్ని పేటిక ఉందనే భయం ఉండాలి. %-% అది అణ్వాయుధం కావచ్చు, అధునాతన సైనికశక్తి కావచ్చు, అంతర్జాతీయ మద్దతు కావచ్చు. కనికరం లేకుండా ఉగ్రవాద దేశాలకు ఇవ్వవలసిన సందేశం ఒకటే: ‘మన దేశాన్ని తాకడమంటే చితిమంటకు ఆహ్వానం’ పలకడమని. జై భరత మాత.

# పిఒకె మనకు దక్కుతుందా?




పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి సాధించుకోవాలన్న పట్టుదలతో భారత ప్రభుత్వం ఉంటోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం మినహా మరో విషయం లేదని, అంతకు మించి మాట్లాడేది లేదని స్పష్టం చేసింది. కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవ చూపించినా దానికి భారత్ ఒప్పుకోవడం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని కరాఖండీగా చెప్పింది. చారిత్రాత్మకంగా ఒకప్పుడు కశ్మీర్ రాచరిక రాష్ట్రంలో భాగమైన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)ను 1947లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశంలో లేదా పాకిస్థాన్‌లో చేరడం లేదా స్వతంత్రంగా ఉండటం అనే ఎంపికకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు (%ఝంప్రఎఅతీ ర్శితీఎ% ) బ్రిటిష్ వారు అవకాశం కల్పించారు. ఆ సమయంలో జమ్మూకశ్మీర్ పాలకుడు మహారాజు హరిసింగ్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలనే హోదాను ఎంచుకున్నారు. అయితే 1947లో పూంచ్‌లో హరిసింగ్ ఆ ప్రాంత రైతులపై విధించిన శిక్షాత్మక పన్నుల కారణంగా తిరుగుబాటు తలెత్తింది. అదే సంవత్సరం అక్టోబర్‌లో వాయువ్య సరిహద్దు ప్రావిన్స్‌కు చెందిన వేలాది మంది పష్టున్ గిరిజనులు మహారాజా పాలన నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి కల్పించాలన్న లక్ష్యంతో పాకిస్తాన్ సైన్యం మద్దతుతో పోరాటం సాగించారు. పరిస్థితిని అదుపు చేయడంలో మహారాజా హరిసింగ్ సైన్యం విఫలమైంది.ఫలితంగా తిరుగుబాటుదారులు పూంచ్ జిల్లాలో ఎక్కువ భాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముజఫరాబాద్, బారాముల్లాలను స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించారు. ఇక చేసేదిలేక భారత ప్రభుత్వ సహాయాన్ని మహారాజా కోరారు. దానికి భారత ప్రభుత్వం ఒక షరతు విధించింది. భారతదేశంలో జమ్మూకశ్మీర్ విలీన ఒప్పందానికి అంగీకరిస్తూ సంతకం చేయాలని సూచించింది. దాంతో మహారాజు హరిసింగ్ అంగీకరించారు. జమ్మూకశ్మీర్ రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ నియంత్రణను భారత ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవించింది. ఫలితంగా రెండు ప్రాంతాలపై స్థిరనియంత్రణ లభించింది. పాకిస్తాన్ మద్దతుగల తిరుగుబాటుదారుల ప్రభావంలో ఉన్న ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌గా ఇప్పుడు పిలవబడుతున్నది. పేరుకే స్వయం పరిపాలనా ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్ పరిపాలిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని ఆజాద్ కశ్మీర్‌గా వ్యవహరిస్తోంది. దీనికి సరిహద్దులుగా ఉత్తరాన గిల్గిట్ బల్టిస్తాన్ (గిల్గిట్ బల్టిస్థాన్ ఆజాద్ కశ్మీర్‌లో భాగం కాదు). దక్షిణాన పాకిస్తాన్ పంజాబ్, పశ్చిమాన ఖైబర్ పఖ్తూన్‌క్వాలు ఉన్నాయి. తూర్పు వైపున జమ్మూకశ్మీర్ ఉంది. ఈ రెండింటి మధ్య నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) ఉంది. ఇది భారత, పాకిస్తాన్ మధ్య వాస్తవ సరిహద్దుగా పనిచేస్తుంది. భౌగోళికంగా ఈ భూభాగం మొత్తం వైశాల్యం 13,297 కి.మీ (5134 చదరపు మైళ్లు). ముజఫరాబాద్ నగరం దీని రాజధాని. 2017 జాతీయ జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 40,45,366. దాదాపు జనాభా అంతా ముస్లింలే. పిఒకెలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. అధ్యక్షుడు రాజ్యాంగబద్ధమైన దేశాధినేత కాగా, ప్రధాన మంత్రి, మంత్రుల మండలి మద్దతుతో కార్యానిర్వాహకత్వం వహిస్తారు. ఏకసభ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఇద్దరినీ ఎన్నుకుంటుంది. స్వంత సుప్రీం కోర్టు, హైకోర్టు ఉన్నాయి. అయితే పాకిస్తాన్ ప్రభుత్వ కశ్మీర్ గిల్గిత్ బాల్టిస్థాన్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, పాకిస్థాన్ ప్రభుత్వానికి, పిఒకె ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. అయితే దీనికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదు. పిఒకెలోని ఉత్తరభూభాగం తరచుగా తీవ్ర భూప్రకంపనాలకు గురవుతుంది. 2005లో సంభవించిన భారీ భూకంపం వల్ల లక్షమంది మృతి చెందగా, మరో 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దీనివల్ల ఈ ప్రాంతం మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ విధ్వంసమయ్యాయి. వ్యవసాయం, పర్యాటకం, సేవలు పైనే ఈ ప్రాంతం ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఒకవంక పాకిస్తాన్, మరోవంక విదేశీ సాయాలతోనే పిఒకె మనుగడ సాగిస్తోంది. దాదాపు 87% పిఒకె కుటుంబాలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. పిఒకెలో ద్రవ్యోల్బణ ఒత్తిడి ఎక్కువగానే ఉంది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు తలెత్తుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ ఉదారవాద విధానాలు, నిరుద్యోగం, అధిక వలసలు ఇవన్నీ తీవ్ర సమస్యలుగా వెంటాడుతున్నాయి. నిరుద్యోగ రేటు 33% వరకు ఉంది. ఉపాధి కోసం యువత గల్ఫ్‌దేశాలకు వలసపోతున్నారు.గత కొన్ని రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, పిఒకెలో ఉన్న వనరులను స్థానిక ప్రజలకు కాకుండా పాక్‌లోని ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం తరలించుకుపోతుండడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోంది. ఇక్కడి జలవిద్యుత్‌ను పాకిస్థాన్‌లోని ఇతర ప్రాంతాలు, నగరాలకు సరఫరా కోసం తరలిస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. హక్కుల కోసం ప్రజలు వీధికెక్కుతున్నారు. ఈ పరిణామాలన్నీ పిఒకెపై పాకిస్థాన్ ప్రభుత్వ పట్టుకోల్పోడానికి దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ గమనించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తమ పాలన లోకి తెచ్చుకోవాలని భారత ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్నారు. అంతేకాదు చర్చల్లో ఇదే ప్రధాన అజెండాగా నిలుస్తోంది.

# ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ప్రకటన.. విధ్వంసకర ఓపెనర్ రీ ఎంట్రీ



భారత మహిళల క్రికెట్ జట్టు ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో భాగంగా ఆతిథ్య ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌లకు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. ఈ రెండు సిరీస్‌లలో భారత కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యహరించనున్నారు. అదేవిధంగా ఇంగ్లండ్ టూర్‌కు స్టార్ ప్లేయర్లు శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్ గాయాల కారణంగా దూరమయ్యారు. శ్రేయాంక చేతి వేలి గాయంతో బాధపడుతుండగా.. రేణుకా మోకాలి గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉంటుంది. దీంతో వీరిద్దరూ శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లోనూ భారత్ జట్టులో భాగం కాలేదు. మరోవైపు వన్డే జట్టు నుంచి కష్వీ గౌతమ్‌ను సెలక్టర్లు తప్పించారు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో గౌతమ్ ఆడే అవకాశం వచ్చినప్పటికి, పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఈ క్రమంలోనే ఆమెను సెలక్టర్లు పక్కన పెట్టారు.

షెఫాలీ రీ ఎంట్రీ..

ఇక భారత టీ20 జట్టులోకి స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ రీ ఎంట్రీ ఇచ్చింది. డబ్ల్యూపీఎల్-2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున షెఫాలీ అద్భుతంగా రాణించడంతో సెలక్టర్లు తిరిగి పిలుపు నిచ్చారు. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్ సీజన్‌లో షెఫాలీ 152.76 స్ట్రైక్ రేటుతో 304 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా సైతం టీ20 జట్టులోకి పునరాగమనం చేసింది. అదేవిధంగా వైఎస్ఆర్ జిల్లాకు చెందిన శ్రీచరణి వన్డే, టీ20 జట్టులో చోటు దక్కించుకుంది. ఇటీవలే శ్రీలంక పర్యటనతో అరంగేట్రం చేసిన శ్రీచరణి.. తన అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇక భారత జట్టు ఇంగ్లండ్ పర్యటన జూన్ 28 నుంచి ప్రారంభం కానుంది.

భారత టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా , హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ రాణా, శ్రీ చరణి, శుచి రణ్‌ఉపాధ్యాయ, కె అరుణ్‌జో ఉపాధ్యాయ్, కె అరుణ్‌జో ఉపాధ్యాయ్ ఉపాధ్యాయ్ సత్ఘరే

భారత వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యాస్తికా భాటియా , తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, స్నేహ రాణా, శ్రీ చరణి, కె అరుంధా రెడ్డి, షుచి అమన్‌ప్రీత్‌కౌర్ గౌడ్, సయాలీ సత్ఘరే

# ఆ దేశ ఆటగాళ్లు లీగ్ పూర్తయ్యే వరకు అందుబాటులో ఉంటారు..!



ఐపీఎల్ 2025 విషయంలో క్రికెట్ సౌతాఫ్రికా (%జూూా%) యూ టర్న్ తీసుకున్నట్లు తెలుస్తుంది. తొలుత తమ ఆటగాళ్లు ప్లే ఆఫ్స్‌కు అందుబాటులో ఉండరని (డబ్ల్యూటీసీ ఫైనల్ సన్నాహకాల కోసం) ప్రకటించిన ఆ క్రికెట్ బోర్డు, తాజాగా మనసు మార్చుకున్నట్లు సమాచారం. లీగ్ పూర్తయ్యే వరకు (జూన్ 3) వారి ఆటగాళ్లు సంబంధిత ఫ్రాంచైజీలతో ఉండేందుకు క్రికెట్ సౌతాఫ్రికా అంగీకరించినట్లు ఐపీఎల్ వర్గాలు అంటున్నాయి. ఈ ప్రచారం నిజమైతే ఫ్రాంచైజీలకు సగం టెన్షన్ వదిలినట్లే. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో 20 మంది సౌతాఫ్రికా ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరిలో 8 మంది డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ ఎనిమిది మందిలో ఆరుగురు (కార్బిన్ బాష్, జన్సెన్, ఎంగిడి, రబాడ, రికెల్టన్, స్టబ్స్) ప్రాతినిథ్యం వహిస్తున్న ఫ్రాంచైజీలు ప్లే ఆఫ్స్‌లో ముందున్నాయి. ఈ ఆరుగురు ప్లే ఆఫ్స్‌కు అందుబాటులో ఉండకపోతే సంబంధిత ఫ్రాంచైజీలు భారీగా నష్టపోతాయి.

చక్రం? తిప్పిన ఫ్రాంచైజీ యజమానులు

క్రికెట్ సౌతాఫ్రికా ఆధ్వర్యంలో నడిచే సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో మొత్తం ఆరు ఫ్రాంచైజీలు ఉన్నాయి. ఈ ఆరు ఫ్రాంచైజీలను ఐపీఎల్ ఫ్రాంచైజీల యాజమాన్యాలే నడిపిస్తున్నాయి. తాజా పరిస్థితి నేపథ్యంలో ప్లే ఆఫ్స్ రేసులో ముందున్న ఫ్రాంచైజీల యాజమాన్యాలు చక్రం తిప్పాయి. వారు క్రికెట్ సౌతాఫ్రికాతో మాటతామంతి జరిపి ఆ దేశ ఆటగాళ్లను ప్లే ఆఫ్స్ పూర్తయ్యే వరకు కొనసాగేందుకు ఒప్పించినట్లు తెలుస్తుంది. కాగా, రీ షెడ్యూల్ ప్రకారం ఐపీఎల్ ఫైనల్ ముగిసిన వారం రోజుల్లోనే సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రతిష్టాత్మక డబ్ల్యూటీసీ ఫైనల్ జరగాల్సి ఉంది.

ఈ నేపథ్యంలోనే క్రికెట్ సౌతాఫ్రికా తమ ఆటగాళ్లను ముందుగా అనుకున్నట్లు మే 26వ తేదీలోగా స్వదేశానికి తిరిగి రావాలని కోరింది. అయితే ఐపీఎల్ ఫ్రాంచైజీల యాజమాన్యాలు చక్రం తిప్పడంతో క్రికెట్ సౌతాఫ్రికా తమ సన్నాహకలను (డబ్ల్యూటీసీ ఫైనల్) వాయిదా వేసుకుంది. జూన్ 3 తర్వాతే వాటి షెడ్యూల్‌ను ప్లాన్ చేసుకుంది.

**ప్లే ఆఫ్స్ రేసులో ముందున్న ఫ్రాంచైజీలకు చెందిన సౌతాఫ్రికా ఆటగాళ్లు (డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఎంపికైన వారు)..**

కార్బిన్ బాష్ (ముంబై ఇండియన్స్)
మార్కో జన్సెన్ (పంజాబ్ కింగ్స్)
లుంగి ఎంగిడి (ఆర్సీబీ)
కగిసో రబాడ (గుజరాత్)
ర్యాన్ రికెల్టన్ (ముంబై)
ట్రిస్టన్ స్టబ్స్ (ఢిల్లీ)

డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం సౌతాఫ్రికా జట్టు: టెంబా బావుమా (కెప్టెన్), ఎయిడెన్ మార్క్రమ్, లుంగి ఎం?గిడి, టోనీ డి జోర్జి, డేవిడ్ బెడింగ్హామ్, కేశవ్ మహరాజ్, ట్రిస్టన్ స్టబ్స్, కార్బిన్ బాష్, సెనురన్ ముత్తుసామి, మార్కో జన్సెన్, కగిసో రబడ, కైల్ వెర్రెయిన్, డేన్ ప్యాటర్సన్, వియాన్ ముల్డర్, ర్యాన్ రికెల్టన్.



# ఆర్సీబీకి శుభవార్త.. హాజిల్‌వుడ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు..?



మే 17 నుంచి ఐపీఎల్ 2025 పునఃప్రారంభం కానున్న వేల ఆర్సీబీకి శుభవార్త అందింది. భారత్-పాక్ మధ్య యుద్ధం కారణంగా? స్వదేశాలకు వెళ్లిపోయిన ఆ ఫ్రాంచైజీ ప్లేయర్లంతా తిరిగి వచ్చేందుకు అంగీకరించారని తెలుస్తుంది. జాతీయ విధుల కారణంగా జేకబ్ బేతెల్ ఒక్కడే తదుపరి లెగ్‌కు అందుబాటులో ఉండడని సమాచారం. స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ తిరిగొచ్చేందుకు అంగీకరించడం ఆర్సీబీకి అతి పెద్ద శుభవార్త. వాస్తవానికి హాజిల్‌వుడ్ ఐపీఎల్ వాయిదా పడకముందే గాయపడ్డాడు. రీ షెడ్యూల్ తర్వాత అతను అందుబాటులో రావడం దాదాపుగా అసాధ్యమేనని అంతా అనుకున్నారు. ఐపీఎల్ ముగిసిన వారం రోజుల్లోనే (జూన్ 11) డబ్ల్యూటీసీ ఫైనల్ ఉండటంతో హాజిల్‌వుడ్ జాతీయ విధులకే ప్రాధ్యాన్యత ఇస్తాడని ప్రచారం జరిగింది. అయితే ఆర్సీబీ యాజమాన్యం చర్చల కారణంగా హాజిల్‌వుడ్ సీజన్ అయిపోయే వరకు ఆడేందుకు అంగీకరించినట్లు తెలుస్తుంది. మరోవైపు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు కూడా తమ ఆటగాళ్లకు లీగ్ అయిపోయే వరకు కొనసాగేందుకు అనుమతి ఇవ్వడంతో లుంగి ఎంగిడి సేవలు కూడా ఆర్సీబీ లీగ్ అయిపోయే వరకు వినియోగించుకోనుంది. మిగతా విదేశీ ఆటగాళ్ల విషయానికొస్తే.. ఫిల్ సాల్ట్ విండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక కాలేదు. దీంతో అతను ప్లే ఆఫ్స్‌లో ఆడేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. టిమ్ డేవిడ్, లివింగ్‌స్టోన్ వారి జట్లలో సభ్యులుగా లేరు. వీరి నుంచి కూడా ఎలాంటి సమస్య లేదు. ఐర్లాండ్‌తో సిరీస్‌కు ఎంపికైనా రొమారియో షెపర్డ్ తమ బోర్డును ఒప్పించుకుని లీగ్ మొత్తానికి అందుబాటులోకి వచ్చాడు. మొత్తంగా చూస్తే.. విదేశీ ఆటగాళ్లంతా లీగ్ అయిపోయే వరకు అందుబాటులో ఉండటం ఆర్సీబీకి శుభపరిణామంగా చెప్పవచ్చు. ఈ సీజన్‌లో ఆర్సీబీ గతంలో ఎన్నడూ లేనట్లుగా హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తుంది. విదేశీ ఆటగాళ్లతో పాటు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా పూర్తిగా అందుబాటులో ఉండటం (టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించడం?), అందులోనూ భీకర ఫామ్‌లో ఉండటం ఆర్సీబీ తొలి టైటిల్ కలను నెరవేర్చేలా కనిపిస్తుంది. ప్రస్తుత సీజన్‌లో ఆర్సీబీ దేశీయ ఆటగాళ్లు కూడా అత్యంత ప్రమాదకరంగా ఉన్నారు. బౌలర్లలో యశ్ దయాల్, కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మ అంచనాలకు మించి రాణిస్తున్నారు. ఆర్సీబీ ప్రస్తుమున్న ప్రధాన సమస్య వారి కెప్టెన్ రజత్ పాటిదార్ ఒక్కడే. పాటిదార్ గాయంతో బాధపడుతుండటంతో పాటు పెద్దగా ఫామ్‌లో లేడు. అతనితో పాటు వికెట్ కీపర్ జితేశ్ శర్మకు కూడా అంచనాలకు తగ్గట్టుగా రాణించడం లేదు. వీరిద్దరు కూడా లైన్‌లోకి వచ్చారంటే ఈ సీజన్‌లో ఆర్సీబీ టైటిల్ గెలవకుండా ఆపడం ఎవరి వల్ల కాదు. దేవ్‌దత్ పడిక్కల్ స్థానంలో వచ్చిన మయాంక్ అగర్వాల్ కూడా టాపార్డర్‌లో మ్యాజిక్ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో (11 మ్యాచ్‌ల్లో 8 విజయాలతో 16 పాయింట్లు) ఉన్న ఆర్సీబీ.. ఈ సీజన్‌లో మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. మే 17న కేకేఆర్‌తో (బెంగళూరు), మే 23న సన్‌రైజర్స్‌తో (బెంగళూరు), మే 27న లక్నోతో (లక్నో) తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా ఆర్సీబీ ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారవుతుంది.

# ముంబై ఇండియన్స్‌లోకి శ్రీలంక కెప్టెన్..!





ఐ పీ ఎల్ - 2025 రీ షెడ్యూల్ కారణంగా దారుణంగా నష్టపోతున్న ఫ్రాంచైజీలలో ముంబై ఇండియన్స్ ఒకటి. భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తల కారణంగా అర్ధరంతరంగా ఆగిపోయిన ఈ ఏడాది ఐపీఎల్ సీజన్.. తిరిగి మే 17 నుంచి ప్రారంభం కానుంది. అయితే చాలా మంది విదేశీ ఆటగాళ్లు జాతీయ విధుల కారణంగా ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరం కానున్నారు. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ జట్టు స్టార్ ప్లేయర్లు ర్యాన్ రికెల్టన్, కార్బిన్ బాష్, విల్ జాక్స్ సేవలను కోల్పోయే అవకాశముంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఎంపిక చేసిన దక్షిణాఫ్రికా జట్టులో బాష్, రికెల్టన్ భాగంగా ఉన్నారు. బాష్, రికెల్టన్ ఒకవేళ ఐపీఎల్‌లో పాల్గొనేందుకు తిరిగి భారత్‌కు వచ్చినా, ప్లే ఆఫ్స్‌కు మాత్రం కచ్చితంగా దూరంగా ఉండనున్నారు. దక్షిణాఫ్రికా క్రికెట్‌తో బీసీసీఐ సంప్రదింపులు జరిపినప్పటికి.. సదరు క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లు లీగ్ పూర్తి అయ్యేంతవరకు ఉండేందుకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు వెస్టిండీస్‌తో త్వరలో జరగబోయే టీ20, వన్డే సిరీస్‌లకు ఎంపిక చేసిన ఇంగ్లండ్ జట్టులో జాక్స్ సభ్యునిగా ఉన్నాడు. అతడు కూడా భారత్‌కు తిరిగి వచ్చినా ప్లే ఆఫ్స్‌కు మాత్రం దూరంగా ఉండనున్నాడు.

ముంబై జట్టులోకి శ్రీలంక కెప్టెన్..?

ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ యాజమాన్యం శ్రీలంక కెప్టెన్ చరిత్ అసలంకపై కన్నేసినట్లు తెలుస్తోంది. తమ జట్టులోకి తీసుకునేందుకు చరిత్ అసలంకాతో ముంబై చర్చలు జరుపుతున్నట్లు శ్రీలంక వార్తా సంస్థ న్యూస్ వైర్ తమ కథనంలో పేర్కొంది. అసలంకకు టీ20ల్లో అద్భుతమైన రికార్డు ఉంది. అతడికి బ్యాట్‌తో పాటు బంతితో కూడా రాణించే సత్తా ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో చరిత్‌కు 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అతడితో ఒప్పందం కుదర్చుకునేందుకు ముంబై ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాగా ఐపీఎల్ రీ షెడ్యూల్ కారణంగా ఈ సీజన్‌లో ఆటగాళ్ల తాత్కాలిక ప్రత్యామ్నాయాలకు బీసీసీఐ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ముంబై ఇండియన్స్‌కు ఈ ఏడాది సీజన్‌లో ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ రెండు మ్యాచ్‌ల్లో హార్దిక్ సేన గెలిస్తే నేరుగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది.

# పంజాబ్ జట్టులోకి డేంజరస్ ప్లేయర్ ఎంట్రీ.. ఇక దబిడి దిబిడే?





**ఐపీఎల్-2025 పునఃప్రారంభానికి ముందు పంజాబ్ కింగ్స్‌కు గుడ్ న్యూస్ అందింది. ఆస్ట్రేలియా విధ్వంసకర ఆల్‌రౌండర్ మిచెల్ ఓవెన్ పంజాబ్ జట్టులో బుధవారం చేరాడు. గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన ఆరో ఆసీస్ ఆటగాడు మ్యాక్స్‌వెల్ స్థానంలో మిచెల్ ఓవెన్‌ను పంజాబ్ మెనెజ్‌మెంట్ ఎంపిక చేసింది. కానీ ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ మధ్యలో ఆగిపోవడంతో ఓవెన్.. పంజాబ్ జట్టుతో చేరడం కాస్త ఆలస్యమైంది. గురువారం(మే 15) నెట్ ప్రాక్టీస్ సెషన్స్‌లో పంజాబ్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్.. ఓవెన్‌ను సహచర ఆటగాళ్లకు పరిచయం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియోను పంజాబ్ కింగ్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. కాగా ఈ ఆసీస్ క్రికెటర్ ముందుగా పాకిస్తాన్ సూపర్ లీగ్-2025లో పెషావల్ జల్మి జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అతడు ఈనెల 9న ఆ జట్టు చివరి గ్రూప్ మ్యాచ్ ఆడాక ఓవెన్ ఐపీఎల్‌లో భాగం కావాల్సి ఉండేది. కానీ పీఎస్ఎల్ కూడా అర్ధాంతరంగా వాయిదా పడడంతో చివరి మ్యాచ్ ఆడకుండానే ఓవెన్ భారత్‌కు చేరుకున్నాడు.**

**ఎవరీ మిచెల్ ఓవెన్..?**

**23 ఏళ్ల మిచెల్ ఓవెన్ లిస్ట్-ఎ, ఫస్ట్‌క్లాస్? క్రికెట్ రెండింటిలోనూ టాస్మానియాకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఫిబ్రవరి 22, 2021న మార్ష్ వన్-డే కప్‌తో లిస్ట్-ఎ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఓవెన్.. షెఫీల్డ్ షీల్డ్‌లో సౌత్ ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో అక్టోబర్ 3, 2023న ఫస్ట్-క్లాస్ అరంగేట్రం చేశాడు. టీ20ల్లో కూడా అతడికి మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు 35 టీ20లు ఆడిన ఓవెన్ 647 పరుగులు చేశాడు. అందులో 452 పరుగులు ఈ ఏడాది బిగ్‌బాష్ సీజన్‌లో చేసినవే కావడం గమనార్హం. బీబీఎల్ 2024-25 సీజన్‌లో ఓవెన్ 452 పరుగులు చేసి లీడింగ్ రన్?స్కోరర్‌గా నిలిచాడు.**

**సిడ్నీ థండర్‌తో జరిగిన ఫైనల్లో మ్యాచ్‌లో ఓవెన్ విధ్వసకర సెంచరీతో చెలరేగాడు. కేవలం 39 బంతుల్లోనే ఓవెన్ తన రెండో బీబీఎల్ సెంచరీ మార్క్‌ను ఓవెన్ అందుకున్నాడు. ఓవెన్‌కు పేస్ బౌలింగ్ చేసే సత్తాకూడా ఉంది.**

**అతడు త్వరలోనే ఆస్ట్రేలియా తరపున అరంగేట్రం చేసే ఛాన్స్ ఉంది. ఇక ఈ ఏడాది ఐపీఎల్-2025 సీజన్ మే 17 నుంచి తిరిగి ప్రారంభం కానుంది.**

# ఆసక్తి రేపుతున్న ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ ఆటగాడి పోస్ట్



ఐపీఎల్ ఫ్రాంచైజీలు తాత్కాలిక రీప్లేస్‌మెంట్ల కోసం వెతుకుతున్న వేల, టీమిండియా ఆటగాడు, ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ ఓపెనర్ పృథ్వీ షా పెట్టిన ఓ పోస్ట్ ఆసక్తి రేపుతోంది. ఈ సీజన్ మెగా వేలంలో అమ్ముడుపోని షా.. "బ్రేక్ కావాలంటూ" ఓ పోస్ట్ పెట్టాడు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు షా రీప్లేస్‌మెంట్ ఆటగాడిగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాడని కామెంట్లు చేస్తున్నారు. 2018లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల షా.. ఐపీఎల్‌లో డీసెంట్ రికార్డు (79 మ్యాచ్‌ల్లో 147.467 స్ట్రయిక్‌రేట్‌తో 1892 పరుగులు) కలిగి ఉన్నాడు. అయితే వ్యక్తిగత అలవాట్లు, ఫిట్‌నెస్ కోల్పోవడం అతన్ని ఐపీఎల్ పాటు దేశవాలీ క్రికెట్‌కు దూరం చేశాయి. గత సీజన్‌లో ఢిల్లీకి ఆడిన షా.. 8 మ్యాచ్‌ల్లో 163.63 స్ట్రయిక్‌రేట్‌తో 198 పరుగులు చేశాడు. ప్రస్తుత సీజన్‌లో ఢిల్లీ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ సేవలు కోల్పోవడంతో షా ఆ జట్టులో చోటు ఆశిస్తున్నాడు. ప్రస్తుత తరుణంలో షాకు ఢిల్లీ అవకాశం ఇవ్వకపోయినా ముంబై ఇండియన్స్ ఛాన్స్ ఇవ్వొచ్చన్న టాక్ నడుస్తుంది. ముంబై ఇండియన్స్ యాజమాన్యం ఇంగ్లండ్ ఆటగాడు విల్ జాక్స్ స్థానాన్ని భర్తీ చేసేందుకు దేశీయ బ్యాటర్ కోసం? చూస్తుందని సమచారం. ఒకప్పుడు టీమిండియా భవిష్యత్తుగా కీర్తించబడ్డ పృథ్వీ షా ఇప్పుడు ఐపీఎల్‌లో ఛాన్స్ కోసం వెంపర్లాడటం ఆసక్తికరంగా మారింది. క్రమశిక్షణ లేకపోతే ఎంత టాలెంట్ ఉన్నా ఇలాంటి గతే పడుతుందని జనాలు అంటున్నారు. పృథ్వీ షాలా కావొద్దని ఇప్పుడిప్పుడే షైన్ అవుతున్న యువ ఆటగాళ్లకు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే, భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం కారణంగా వారం రోజులు వాయిదా పడిన ఐపీఎల్ 2025 మే 17 నుంచి పునఃప్రారంభం కానుంది. యుద్ధం నేపథ్యంలో స్వదేశాలకు వెళ్లిపోయిన విదేశీ క్రికెటర్లు జాతీయ జట్ల అవసరాల దృష్ట్యా ఐపీఎల్ తదుపరి లెగ్‌లో పాల్గొనలేకపోతున్నారు. కొందరు ఇతరత్రా కారణాల చేత ఐపీఎల్‌లో కొనసాగేందుకు విముఖత చూపారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ గవర్నింగ్ బాడీ తిరిగి రాని ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసుకునేందుకు ఫ్రాంచైజీలకు వెసులుబాటు కల్పించింది. ?ఈ క్రమంలోనే పృథ్వీ షా లాంటి చాలా మంది భారత ఆటగాళ్లు ఛాన్స్‌ల కోసం ఎదురుచూస్తున్నారు.


Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- RNI TELTEL/2024/89620